మోడీ ప్రధాన అస్త్రం ఇడి

- కేంద్ర ఏజెన్సీలతో ప్రతిపక్షాలపై దాడులు
- లోక్‌సభ ఎన్నికల ముందు బిజెపి వ్యూహాలు
- కేజ్రీవాల్, హేమంత్ సోరేన్ అరెస్టులు అందులో భాగమే

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 228 | విజయవాడ, శనివారం 23 మార్చి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 23 March 2024 | Rs

ఐపిఎల్ వేడుకలు అదుర్స్...

- అలరించిన బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ విన్యాసం
- ఎఆర్ రెహమాన్, సోను నిగమ్, టైగర్ ష్రాఫ్ ప్రదర్శనలు కూడా..

8

ఎన్నికల్లో కొట్టుకుపోయిన

కరువు

(ఫైల్‌ఫొటో)

- రబీలో సమస్య తీవ్రం
- 661 మండలాల్లో డ్రైస్పెల్స్
- 14 లక్షల ఎకరాలు బీడు
- కోడ్ వచ్చాక అరకొర మండలాలతో సరిపెట్టిన సర్కారు
- పట్టించుకోని పొత్తు పార్టీలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రబీలో ఈ మారు తీవ్ర కరువు నెలకొనగా, ఆ సమస్య ఎన్నికల్లో కొట్టుకుపోయింది. ఖరీఫ్‌లో మాదిరిగానే రబీలోనూ ప్రభుత్వం కరువుకు కోతలు పెట్టింది. ఎన్నికల్లో తలమునకలై సీజన్ ముగుస్తున్నా కరువుపై పట్టించుకోకుండా, చివరి నిమిషంలో.. అదీ ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేశాక, శనివారం రాత్రి హడావిడిగా ఆరు జిల్లాల్లోని 87 మండలాల్లో కరువును గుర్తిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఎన్నికల వ్యూహ ప్రతివ్యూహాల్లో బిజీగా ఉన్న టిడిపి, జనసేన కరువును విస్మరించాయి. కేంద్రం నుంచి రాష్ట్రానికి యుద్ధప్రాతిపదికన తగిన సాయం తీసుకురావాల్సిన బిజెపి గమ్మునుంది. పంటలు సాగుకాక, వేసిన పంటలు దెబ్బతిని రైతులు ఆవేదన చెందుతున్నారు. తమను ఆదుకోవాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.

కత్తెర్లు

ఖరీఫ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 300 మండలాలకు పైన తీవ్ర కరువుండగా, కేంద్ర డ్రాట్ మాన్యువల్ మేరకు అక్టోబర్ 31 లోపు కరువు మండలాలను ప్రకటించాల్సి ఉండగా, చివరి రోజు ఆఖరి ఘడియల్లో 101 తీవ్ర, రెండు మధ్యస్త స్థాయి వెరశి 103 మండలాలను ప్రభుత్వం ప్రకటించింది. రబీనీ కరువు వెంటాడింది. ఈశాన్య రుతుపవన కాలం అక్టోబర్-డిసెంబర్ కాగా, ఈ సమయంలో 661 మండలాల్లో డ్రైస్పెల్స్ నెలకొన్నట్లు ప్రభుత్వ నివేదికలు తెలుపుతున్నాయి. 255 మండలాల్లో సింగిల్, 378 మండలాల్లో డబుల్, 28 మండలాల్లో ట్రిపుల్ డ్రైస్పెల్స్ నెలకొన్నట్లు పేర్కొన్నాయి. రబీ అక్టోబర్ 1 నుంచి మొదలుకాగా అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ నెలలోనూ సరైన వర్షాల్లేవు. అక్టోబర్‌లో 87.7 శాతం తక్కువ వర్షం పడింది. ఆ నెలలో 55 మండలాల్లో చినుకు లేదు. 583 మండలాల్లో అత్యల్ప స్థాయి, 39 మండలాల్లో తక్కువ స్థాయి వర్షం నమోదైంది. ఆ నెలకొచ్చేసరికి 598 డ్రైస్పెల్ మండలాలున్నాయి. నవంబర్‌లో 31.5 శాతం తక్కువ వర్షం కురిసింది. మూడు మండలాల్లో అస్సలు వాన లేదు. 241 మండలాల్లో అత్యల్ప, 218 మండలాల్లో తక్కువ వర్షం పడింది. ఆ నెలలో 466 మండలాల్లో మిగతా 2లో

డ్రైస్పెల్ మండలాలు

జిల్లా	మొత్తం మండలాలు	డ్రైస్పెల్ మండలాలు
శ్రీకాకుళం	30	29
విజయనగరం	27	27
మన్యం	15	14
అల్లూరి	22	16
విశాఖపట్నం	11	11
అనకాపల్లి	24	23
కాకినాడ	21	21
కోనసీమ	22	22
తూర్పుగోదావరి	19	17
పశ్చిమగోదావరి	20	20
ఏలూరు	27	24
కృష్ణా	25	25
ఎన్‌టిఆర్	20	17
గుంటూరు	18	18
బాపట్ల	25	25
పల్నాడు	28	27
ప్రకాశం	38	38
నెల్లూరు	38	38
కర్నూలు	26	26
నంద్యాల	29	29
అనంతపురం	31	31
శ్రీసత్యసాయి	32	32
వైఎస్ఆర్	36	36
అన్నమయ్య	30	30
చిత్తూరు	31	31
తిరుపతి	34	34
రాష్ట్రం	**679**	**661**

ట్రాన్స్‌జెండర్లకు 'ఉపాధి హామీ'

- సర్క్యులరు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి హామీ చట్టం వర్తింపజేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎట్టకేలకు నిర్ణయం తీసుకున్నాయి. ఈ నేపథ్యం లో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15న రాష్ట్రంలోని అందరు కలెక్టర్లకు, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లకు సర్క్యులర్లు జారీ చేసింది. వివక్ష, ఉపాధిలేమితో ట్రాన్స్‌జెండర్లు అవస్థలు పడుతున్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలంటూ ప్రభుత్వాలకు చాలా కాలంగా విన్నవించుకుంటున్నారు. ఎట్టకేలకు స్పందించిన సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ట్రాన్స్‌జెండర్లకు కోరిన వెంటనే ఉపాధి పనులు కల్పించాలని రాష్ట్రానికి సూచించింది. దీంతో, రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయి అధికారులకు సర్క్యులర్ పంపింది. ఆ సర్క్యులర్ ప్రకారం..... ట్రాన్స్‌జెండర్‌ను ఒక కుటుంబంగా గుర్తించి ప్రత్యేక జాబ్‌కార్డు ఇవ్వాలి. నిర్దేశిత దరఖాస్తులో పురుషులు, స్త్రీలతోపాటు ట్రాన్స్‌జెండర్ కాలమ్ పొందుపర్చాలి. ఏదైనా గ్రామ పంచాయతీలో ఐదుగురు కంటే ఎక్కువ ట్రాన్స్‌జెండర్లు ఉంటే, వారిని ప్రత్యేక శ్రమశక్తి సంఘం (టిజిఎస్ఎస్ఎస్)గా ఏర్పాటు చేయాలి. పనిచేయలేరనే భావనతో వారి అభ్యర్థనను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదు. అలా చేస్తే చట్ట ఉల్లంఘనగా ప్రభుత్వం పరిగణిస్తుంది. ఇతర వేతనదారులతో కలిపి వారికి పని కల్పించవచ్చు. దీనికి ముందుగా ఆయా వేతనదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తగు అవగాహన కల్పించాలి. పని ప్రదేశాల్లో ట్రాన్స్‌జెండర్లను కించపర్చే విధంగా మాట్లాడడం, వెకిలి చేష్టలు చేయడం వంటివి చట్టపరమైన నేరంగా పరిగణించాలి. వారి సమస్యల పరిష్కారానికి మండల, జిల్లా స్థాయిలో నోడల్ ఆఫీసర్లను నియమించాలి. సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు వివక్షలేని వాతావరణం కల్పించడంతోపాటు అభివృద్ధిలో సమాన భాగస్వామ్యం కల్పించడం ఈ సర్క్యులర్ ముఖ్య ఉద్దేశం.

ఢిల్లీ కోర్టులో విచారణకు హాజరైన కేజ్రీవాల్

కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా

దేశవ్యాపిత నిరసనలు

- 26న మోడీ నివాసం వద్ద ఘెరావ్
- బిజెపి కార్యాలయాల ఎదుట ఆందోళన : ఆప్ పిలుపు
- సిపిఎం మద్దతు
- ఇసికి ఇండియా ఫోరం నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద కేజ్రీవాల్‌పై తప్పుడు కేసు బనాయించి అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాపిత నిరసనలకు ఆమాద్మీ పార్టీ (ఆప్) పిలుపునిచ్చింది. అరెస్టుకు నిరసనగా ఈ నెల26న ప్రధాని నివాసానికి మార్చ్ నిర్వహించాలని, దేశవ్యాపితంగా బిజెపి కార్యాలయాల ఎదుట నిరసనలు తెలపాలని, వీటిలో ప్రజాతంత్రవాదులంతా పాల్గొనాలని ఆప్ విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా ఆప్ నేతలు ఆందోళనలకు దిగారు.. పార్టీ నేతలు, కార్యకర్తలు ఢిల్లీలో ఉదయం నుంచి రోడ్లపైకి వచ్చి బిజెపికి వ్యతిరేకంగా బిగ్గరగా నినదించారు. ఐటిఓ కూడలి, డిడియు మార్గ్‌లోని ఆప్, బిజెపి ప్రధాన కార్యాలయం, ఇతర ప్రదేశాలు నిరసనలతో దద్దరిల్లాయి.. నిరసనకారులను పోలీసులు చెదరగొట్టారు. మంత్రులు అతిషీ, సౌరభ్‌తో సహా పలువురు కార్యకర్తలు, నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిరసనలు, ఆందోళనలతో ఢిల్లీలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిరసనల నేపథ్యంలో బిజెపి ప్రధాన కార్యాలయం, ఇడి కార్యాలయానికి వెళ్లే మార్గాలను అధికారులు మూసివేశారు. 144 సెక్షన్ విధించారు. ఢిల్లీలోని ఐటిఓ మెట్రో స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం వరకూ మిగతా 7లో

కేజ్రీవాల్‌కు ఆరు రోజులు ఇడి కస్టడీ

- రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు

7

అరెస్టుపై సిపిఎం ఖండన

బిజెపితో బిజెడి కటీఫ్

- ఒడిషా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో విడివిడిగా పోటీ
- కేంద్రంలో పదేళ్లు మద్దతుకు బిజెడికి మోడీ కృతజ్ఞతలు

ప్రధాని మోడీ, బిజెడి అధినేత, ఒడిశా సిఎం నవీన్‌పట్నాయక్ (ఫైల్)

భువనేశ్వర్ : ఒడిషాలో అధికార బిజూ జనతా దళ్ (బిజెడి), బిజెపితో సంబంధాలు తెంచుకుంది. రాష్ట్రంలోని 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ స్థానాలకు మే13 నుండి జూన్ 1 మధ్య నాలుగు విడతలుగా జరగనున్న ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు వేరువేరుగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఒడిషాలో బిజెపి ఒంటరిగానే పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మన్మోహన్ సమల్ ప్రకటించారు. 'ఈసారి, రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో బిజెపి పోటీ చేస్తుందని తెలిపారు. 'మేం చాలా అంశాలపై మరీ ముఖ్యంగా ఒడిషా గుర్తింపు, ఒడిషా ప్రతిష్ట, ఒడిషా ప్రజల ప్రయోజనం.. వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంతో ఏకీభించడం లేదు' అని ఆయన అన్నారు. అయితే గత పదేళ్లల్లో అనేక అంశాలపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినందుకు బిజెడికి ఆయన కృజత్ఞలు తెలిపారు. బిజెపి-బిజెడితో మధ్య పొత్తుపై గత 17 రోజులుగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది. '2036 నాటికి అంటే ఒడిషా రాష్ట్రం అవతరించి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి బిజెడి, ముఖ్యమంత్రి సాధించాల్సిన ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి. వీటిని సాధించడానికి, ఒడిషా, ఒడిషా ప్రజల ప్రయోజనాల కోసం తాము చేయాల్సిందంతా చేస్తామని బిజెడి ' బిజెడి ఆ ప్రకటనలో తెలిపింది. బిజెడి- బిజెపి మధ్య సంబంధాలు తెగిపోవడం ఇదే మొదటిసారి కాదు. 1998 నుంచి 2009 వరకు ఈ రెండు పార్టీలు ఎన్‌డిఎ కూటమిలో ఉన్నాయి. నవీన్ పట్నాయక్ వాజ్‌పేయ్ క్యాబినేట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. అయితే క్రైస్తవులపై సంఘ్ పరివార్ హింసాత్మక దాడులకు తెగబడినప్పుడు బిజెడి, ఆ పార్టీతో తెగతెంపులు చేసుకుంది. దీంతో 2009, 2014 ఎన్నికల్లో బిజెపి ఒంటరిగానే పోటీ చేసి దారుణంగా భంగపడింది. మళ్లీ 2019 ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు మరోసారి జత కట్టాయి.

సమగ్ర దర్యాప్తు జరపండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ పోర్టులో దొరికిన డ్రగ్స్ కంటైనర్ వ్యవహారంపై ప్రత్యేక బృందం ద్వారా సమగ్ర దర్యాప్తు జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. బిజెపి, వైసిపి, టిడిపి నాయకుల పరస్పర ఆరోపణలు చూస్తుంటే ఈ పార్టీల మద్దతుతోనే డ్రగ్స్ మాఫియా నడుస్తున్నట్లు అర్థమవుతోందని, ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా మారుస్తామని వారు హామీ ఇవ్వాలని కోరారు. డ్రగ్స్ కంటైనర్లు దిగుమతి చేసుకున్న కంపెనీ ఓనర్లతో తమకు సంబంధం ఉందో లేదో ఆ పార్టీ నాయకులే ప్రజలకు వాస్తవాలు చెప్పాలని డిమాండ్ చేశారు. రొయ్యల మేత పేరుతో డ్రగ్స్ దిగుమతి చేయడం చూస్తుంటే ప్రభుత్వ యంత్రాంగం అండ లేకుండా సాధ్యం కాదని, వారికి సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటర్‌పోల్ నుండి 18వ తేదీన సమాచారం వచ్చినా నాలుగు రోజులు ఎందుకు ఆలస్యం చేశారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. దేశంలో ఎక్కడ డ్రగ్స్ పట్టుబడినా రాష్ట్రంలోనే మూలాలు కనబడుతున్నాయని, మిగతా 2లో

డ్రగ్స్‌తో రాజకీయ ప్రకంపనలు

టిడిపి, బిజెపి, వైసిపిల పరస్పర ఆరోపణలు ● మాపై ఒత్తిడి లేదు : విశాఖ సిపి

సంధ్య ఆక్వా పరిశ్రమ వద్ద దాడులు నిర్వహిస్తున్న సిబిఐ అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, యు.కొత్తపల్లి(కాకినాడ జిల్లా)

విశాఖ పోర్టులో భారీగా పట్టుబడిన డ్రగ్స్ వ్యవహారం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎన్నికల సమయం కూడా కావడంతో టిడిపి, బిజెపి, వైసిపిలు పెద్ద ఎత్తున పరస్పర విమర్శలకు దిగుతున్నాయి. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డ్రగ్స్ వ్యవహారంతో రాజకీయ పార్టీల పేర్లు ముడిపడటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు శుక్రవారం నాడు ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న సంధ్యా అక్వా పరిశ్రమలో సిబిఐ దాడులు కొనసాగాయి. కాకినాడలోని ఆ సంస్థ కార్యాలయంఒ గురువారం సాయంత్రం నుండి శుక్రవారం సాయంత్రం వరకు 24 గంటల పాటు తనిఖీలు కొనసాగాయి. పట్టుబడిన సరుకుకు ఉన్నతాధికారుల సమక్షంలో మరోసారి పరీక్షలు నిర్వహించడానిక సిబిఐ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై విలేకరులతో మాట్లాడిన విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్ తమపై ప్రభుత్వ ఒత్తిడి ఉందన్న ఆరోపణలు తోసిపుచ్చారు. తమపై ఎవరి ఒత్తిడి లేదని ఆయన స్పష్టం చేశారు. సిబిఐ అధికారులు సమర్పించిన నివేదికలో తమపై చేసిన వ్యాఖ్యలే కేవలం సాంకేతికమేనని ఆయన చెప్పారు.

డ్రగ్స్ వెనుక ఎవరు...?

సంధ్యా అక్వాలో సిబిఐ తనిఖీలు ఇంకా కొనసాగుతుండగానే ఈ రాకెట్ వెనక ఉన్నదెవరు అన్న అంశం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. డ్రగ్స్ పట్టుబడిన విషయం బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే వైసిపి నాయకత్వంపై టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి లోకేష్‌లు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత కాసేపటికి వైసిపికూడా టిడిపిపై ఇదేరకమైన ఆరోపణలు చేసింది. ఆ కేసులో కీలకంగా ఉన్న సంధ్యా ఆక్వాకు చెందిన కోటయ్య చౌదరికి టిడిపి నేతలకు సన్నిహిత సంబంధాలున్నాయని ఆ పార్టీ పేర్కొంది. చంద్రబాబునాయుడికి లోకేష్‌కు ఈ కేసుతో నేరుగా సంబంధాలుండే అవకాశాలున్నాయని మిగతా 2లో

తెలంగాణ బిజెపి నేతకు

టిడిపి బాపట్ల ఎంపి టికెట్

- దేవినేని ఉమా, కళా వెంకట్రావుకు మొండిచెయ్యి
- మూడో జాబితా విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణకు చెందిన బిజెపి నేత టి. కృష్ణప్రసాద్ తెలుగుదేశం పార్టీ నుండి ఎంపి అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగనున్నారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం విడుదల చేసిన మూడవ జాబితాలో ఆయన పేరు చోటుచేసుకుంది. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామంతో టిడిపి శ్రేణులు విస్మయం వ్యక్తం చేశాయి. తెలంగాణ డిజిపిగా పనిచేసిన కృష్ణప్రసాద్ ఉద్యోగ విరమణ అనంతరం బిజెపిలో చేరారు. ఆ పార్టీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ రాష్ట్రంలోనే ఎన్నికల బరిలోకి దిగాలని భావించారు. కంటోన్మెంట్, వరంగల్ లోక్‌సభ స్థానాల్లో ఏదో ఒకదానిని తనకు కేటాయించాలని బిజెపి నాయకత్వాన్ని కోరారు. ఈ మేరకు స్థానికంగా ప్రచారం కూడా చేసుకుంటున్నారు. అటువంటి వ్యక్తిని బాపట్ల అభ్యర్థిగా బరిలోకి దించుతుండటం స్థానిక టిడిపి శ్రేణుల్లో కలకలం రేపింది. ఆ సీటునుండి బరిలోకి దిగాలని భావిస్తున్న ఆశావహులు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కృష్ణ ప్రసాద్‌కు టిడిపి సభ్యత్వం కూడా లేదని చెబుతున్నారు. బిజెపి సభ్యత్వం ఉన్న వ్యక్తికి టిడిపి టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

బాపట్ల సీటును ఆ పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు, వైసిపి నుంచి టిడిపిలో చేరిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ఆశించారు. ఎంఎస్ రాజుకు దాదాపుగా ఖరారైందని నేతలు భావించారు. కానీ చివరి నిమిషంలో బిజెపి నేతకు టిక్కెట్ దక్కింది. దీంతో 'రాజకీయాలు ఎలా ఉంటాయో, ఎవరు ఎలాంటి వారో ఈ రోజు అర్థమయ్యింది' అంటూ ఉండవల్లి శ్రీదేవి తన ఎక్స్(ట్విట్టర్)లో రాశారు. మైలవరం నుంచి టికెట్ ఆశించిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు నిరాశ తప్పలేదు. ఇక్కడ నుంచి వైసిపి నుంచి పార్టీలో చేరిన వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు టిక్కెట్ దక్కింది. దేవినేనికి పెనమలూరు వస్తుందని ప్రచారం సాగుతోంది. ఈ జాబితాలో కూడా సీటు దక్కకపోవడంతో దేవినేని కూడా అసంతృప్తిలో ఉన్నారు. నెల్లూరు జిల్లా కోవూరులో పొలంరెడ్డి దినేష్ రెడ్డి ముందు నుంచి నియోజకవర్గంలో కష్టపడి తిరిగారు. టికెట్ మాత్రం ఇటీవల పార్టీలో చేరిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి భార్య ప్రశాంతి రెడ్డికి కేటాయించారు. మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు భీమిలి నుంచి టికెట్ ఆశిస్తున్నారు. అయితే చంద్రబాబు చీపురుపల్లి నుంచి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని చెప్పారు. దీనికి గంటా సుముఖత మిగతా 2లో

పెట్రో యూనివర్సిటీపై కేంద్రం నిర్లక్ష్యం

- ఎనిమిదేళ్లవుతున్నా ప్రాథమిక దశలోనే పనులు
- ఎయులో అరకొర వసతుల మధ్య తరగతులు

పోరాట యోధుడు 'అప్పారి'

- వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు

నిఘాపై 3న ప్రత్యేక సమీక్ష

- సిఇఒ ముఖేష్‌కుమార్‌మీనా

● లోపలి పేజీలో..●

కొజికోడ్ బీచ్ ర్యాలీలో మాట్లాడుతున్న కేరళ సిఎం పినరయి విజయన్

సిఎఎపై పోరు కొనసాగుతుంది

- కొజికోడ్ బీచ్ ర్యాలీలో కేరళ సిఎం విజయన్
- రోహింగ్యా శరణార్థులను బయటకు పంపేందుకే ఈ ఎత్తుగడ అంటూ విమర్శ
- కాంగ్రెస్ వైఖరి ఏమిటో వెల్లడించాలని డిమాండ్

కొజికోడ్ : సిఎఎ (పౌరసత్వ సవరణ చట్టం)ను అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, దేశం నుంచి రోహింగ్యా శరణార్థులను బయటకు పంపేందుకు వ్యూహాత్మకంగా పన్నిన ఎత్తుగడేనని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. సిఎఎకు వ్యతిరేకంగా కొజికోడ్ బీచ్‌లో శుక్రవారం ఎల్‌డిఎఫ్ వేలాది మందితో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. శరణార్థుల పట్ల సార్వజనీన దృక్పథాన్ని సిఎఎ ఉల్లంఘిస్తోందని, దీనివల్ల ప్రపంచ దేశాల్లో భారత్ ఏకాకి అయ్యే పరిస్థితి వస్తుందన్నారు. పౌరసత్వానికి మతాన్ని ఒక ప్రామాణికంగా తీసుకొస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యను ఐక్యరాజ్య సమితి, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సహా ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.. కేవలం దేశ పౌరులకే మిగతా 7లో

మే 13న సెలవు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో శాసనసభ, పార్లమెంటు ఎన్నికల పోలింగు మే 13న జరగనుంది. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పాల్గొనేందుకు వీలుగా పోలింగ్ రోజు ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం జిఓ ఆర్‌టి నెంబరు 630ను విడుదల చేసింది.

ఆన్‌లైన్‌లో మొదటి అప్పిలేట్ పట్ల హర్షం

- ఆర్‌టిఐ వేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర సమాచార కమిషన్ మొదటి అప్పిలేట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల ఆర్‌టిఐ వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎస్ సూర్యనారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆర్‌టిఐ కోసం దరఖాస్తు చేసుకున్నవారు విచారణకు రావడం ఖర్చుతో కూడుకున్నదని, అందుకే సుప్రీంకోర్టు మార్గదర్శకాలు రెండో అప్పిలేట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించినట్లుగా మొదటి అప్పిలేట్‌కు ఆన్‌లైన్‌లో విచారణకు అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తున్నట్లు సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ఉక్కు' పరిరక్షణకు ఎలాంటి పోరాటాలకైనా సిద్ధం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం ఎలాంటి త్యాగాలకైనా ఉక్కు కార్మికులు సిద్ధంగా ఉన్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1135వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ టిపిపి, ఆర్ఇడి, పిఇఎం, స్టోర్స్, ఎస్ఎండి విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కార్మికులను మానసికంగా, ఆర్థికంగా కుంగదీయాలని చూస్తున్న ప్లాంట్ యాజమాన్య చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపే వరకూ, ప్రయివేటీకరణ విరమించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఐదుగురు వలంటీర్ల తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి, రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొన్న ఐదుగురు వలంటీర్లపై వేటు పడింది. విజయనగరం జిల్లా గరివిడి మండలం చుక్కవలసకు చెందిన దబ్బాక వెంకటలక్ష్మి, విజయనగరంలోని అద్దేపల్లివారి వీధికి చెందిన గురజాపు చంద్రశేఖర్, గంగి మురళి, కుప్ప గురుమూర్తి, బసవ రాజు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు ఫిర్యాదులు అందాయి. విచారణలో నిజమని తేలడంతో వారిని విధుల నుంచి తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

కామన్ సింబల్ కేటాయించాలని పిల్

ప్రజాశక్తి-అమరావతి

ప్రజాశాంతి పార్టీకి కామన్ సింబల్ కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలనే వ్యాజ్యాన్ని శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. ఆ పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇతరులను ఆదేశించింది. ఇసి తరపున న్యాయవాది శివదర్శన్ వాదనలు వినిపిస్తూ... కామన్ సింబల్ కేటాయించాలని కోరుతూ పిటిషనరు ఈ ఏడాది జనవరి 19న సమర్పించిన వినతిపత్రం నిర్దిష్ట విధానంలో లేకపోవడంతో దానిని ఇసి తిరస్కరించిందని చెప్పారు. ఈ నెల 19న పిటిషనరు తాజాగా సమర్పించిన వినతి కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలనలో ఉందన్నారు. తదుపరి విచారణను వారం రోజులకు న్యాయస్థానం వాయిదా వేసింది.

ఎన్నికల్లో కొట్టుకుపోయిన కరువు

మొదటిపేజి తరువాయి

డ్రైస్పెల్స్ ఉన్నాయి. డిసెంబర్‌లో మిచౌంగ్ తుపాన్ వలన సగటున 546 శాతం వర్షం అధికంగా పడింది. అయినప్పటికీ 8 మండలాల్లో చినుకు లేదు. 99 మండలాల్లో అత్యల్ప, 20 మండలాల్లో తక్కువ వర్షం రికార్డయింది. జనవరిలో 77.5 శాతం, ఫిబ్రవరిలో 98.7 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. మార్చిలోనూ అదే పరిస్థితి.

14 లక్షల ఎకరాల్లో సాగు లేదు

రబీలో కావాల్సిన సాధారణ సాగు విస్తీర్ణంలో 14 లక్షల ఎకరాలు సాగు లేక బీడు పడ్డాయి. ఆహార పంటలు 26 శాతం విస్తీర్ణంలో సేద్యం కాలేదు. వరి 29 శాతం, పప్పులు 27 శాతం సేద్యం కాలేదు. వేసిన పంటలు సైతం ఎండుతున్నాయి. విద్యుత్ కోతలు, కాల్వలకు నీరు అందకపోవడం, భూగర్భజలాలు తగ్గడం వలన లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మిచౌంగ్ తుపాన్ వలన ఖరీఫ్ పంటలు పోయాయి. పంట నష్ట పరిహారం రైతులందరికీ అందలేదు. ఇచ్చిన స్కేల్ ఆఫ్ అసిస్టెన్స్ చాలా తక్కువ. బీమా ఏమైందో తెలీదు. ఖరీఫ్‌లో ప్రకటించిన మండలాలే తక్కువ కాగా రుణాల రీషెడ్యూల్, తిరిగి పంటలేసుకోడానికి సబ్సిడీ రుణాలు, ఇతర సహాయ కార్యక్రమాలు అందించలేదు. గ్రామాల్లో, నగరాల్లో, పట్టణాల్లో తాగునీటి, కూలీలకు ఉపాధి సమస్యలు ఉన్నాయి. ఎన్నికల హడావిడిలో ఉన్న యంత్రాంగం పట్టించుకునే స్థితిలో లేదు.

మోడీ కుట్రలను తిప్పికొట్టండి

- వి శ్రీనివాసరావు పిలుపు
- కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా ఇండియా వేదిక నిరసన



విజయవాడ ధర్నాచౌక్‌లో ఆందోళనచేస్తున్న ఇండియా వేదిక నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాతీర్పును హైజాక్ చేసే కుట్రలో భాగంగా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిందని, ఈ అరెస్ట్‌ను దేశంలోని ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ఖండించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా శుక్రవారం ఇండియా వేదికలోని పార్టీలు విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ తరహా కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అవినీతి కుంభకోణాల్లో మునిగిపోయిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలపై అవినీతి ముద్ర వేస్తూ జైళ్లకు పంపడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఐదేళ్ల కాలంలో ఇడి, సిబిఐ బనాయించిన కేసుల్లో 95శాతం ప్రతిపక్షపార్టీ నేతలపై వున్నాయంటే నరేంద్రమోడీ ప్రభుత్వం ఎంతగా కక్షపూరిత రాజకీయాలకు బరితెగిస్తోందో అర్థమవుతోందన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పురందేశ్వరి మద్యం కుంబకోణంపై కేంద్ర హోమ్ మంత్రికి ఫిర్యాదు చేసినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. విశాఖ డ్రగ్స్‌పై సమాచారం వచ్చినా చర్యలు తీసుకునేందుకు ఆరు రోజుల సమయం ఎందుకు పట్టిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. అవినీతిలో కూరుకుపోయిన బిజెపి, వైసిపి, టిడిపిలు ఒకరిమీద ఒకరు నెపంనెట్టుకుంటున్నాయని అన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ అవినీతికేసుల్లో బిజెపి కూరుకుపోయినా కేంద్ర దర్యాప్తు సంస్థలు స్పందించడం లేదని అన్నారు. ప్రతిపక్షాల మీదికి మాత్రం ఎలాంటి ఆధారాలు లేకున్నా ఫిర్యాదులు రాగానే అరెస్ట్‌లు చేస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దారిమళ్లించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొందన్నారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర తర్వాత ఇండియా వేదిక అంటే మోడీకి భయం పట్టుకుందన్నారు. అందుకే కాంగ్రెస్‌పార్టీ ఆర్థిక కార్యకలాపాలను స్థంబింప జేయడంతోపాటు భయభ్రాంతులకు గురిచేసేందుకు ఇండియా వేదిక నాయకులను అక్రమ కేసుల్లో అరెస్ట్ చేసి జైళ్లలో పెడుతోందన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు అక్కినేని వనజ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవినీతిలో పూర్తిగా కూరుకుపోయిందన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బిజెపి దేశంలో దందాకు పాల్పడుతోందని విమర్శించారు. ఫ్యూచర్ గేమింగ్ కంపెనీకి చెందిన అమిత్‌షాను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలన్నింటికీ ప్రతిపక్షాలు టార్గెట్ కావడం సరైంది కాదన్నారు. ఈ సందర్భంగా ఆప్ కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ దేశంలోని ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని మోడీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలన్నింటిని దుర్వినియోగపరుస్తున్నారని విమర్శించారు. పేద ప్రజలకు కార్పోరేట్ విద్యను అందించిన మనీష్ సిసోడియాను ఏడాది కాలంగా జైలులో వుంచిన ప్రభుత్వం ఇపుడు కేజ్రీవాల్‌ను కూడా అక్రమంగా అరెస్ట్ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, నగర కార్యదర్శి డి కాశీపతి, నాయకులు సత్యబాబు, కాంగ్రెస్ నాయకులు నరహరిశెట్టి నరసింహారావు, సిపిఐ నాయకులు ఫణికుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

పోరాట యోధుడు 'అప్పారి'

- వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు

ప్రజాశక్తి-నెల్లూరు

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడు అప్పారి వెంకటస్వామి అని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. నెల్లూరు యుటిఎఫ్ భవన్‌లో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు వివి.శేషులు అధ్యక్షతన అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా రంగంలోనూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనూ ఆనాటి ప్రభుత్వాల నిరంకుశ విధానాలను ఎండగట్టడానికి చారిత్రాత్మక అవసరంగా యుటిఎఫ్ ఆవిర్భావం జరిగిందని తెలిపారు. ఆవిర్భావ ప్రధాన కార్యదర్శిగా సంఘ నిర్మాణంలోనూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనూ, విద్యారంగ పరిరక్షణలోనూ, రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతూ 25 సంవత్సరాల పైబడి సంఘానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అప్పారి అని కొనియాడారు. సంఘం కోసం తన ఉద్యోగాన్ని సైతం వదిలేశారని గుర్తు చేశారు. ఆయన చూపిన ఆదర్శ మార్గంలో సమాజ అభివృద్ధికి, విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జివి చలపతి శర్మ, రాష్ట్ర నాయకులు వి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సిగరెట్టు ప్యాకెట్లలో డ్రగ్స్

బొల్లారం పిఎస్ఎన్ మెడికేర్ ప్రయివేట్ లిమిటెడ్‌లో అధికారుల సోదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా బొల్లారం పారిశ్రామికవాడలో డ్రగ్స్ కలకలం రేపింది. పారిశ్రామిక వాడలోని పిఎస్ఎన్ మెడికేర్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం ఇంటర్ పోల్ సమాచారంతో అధికారులు దాడులు చేపట్టారు. పరిశ్రమలో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు తొమ్మిది కోట్ల రూపాయల విలువ చేసే 90.48 కిలోల మేపిడ్రీన్ డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పదేళ్ల నుంచి ఈ డ్రగ్‌ను తయారు చేసి విదేశాలకు తరలిస్తున్నట్టుగా అధికారుల పరిశీలనలో తేలింది. ఈ వ్యవహారానికి సూత్రధారులైన సత్యనారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కస్తూరి రెడ్డిని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు అరెస్టు చేశారు. సిగరెట్టు ప్యాకెట్లలో పెట్టి విదేశాలకు డ్రగ్స్‌ను తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇందులో కొంత వరకు హైదరాబాద్ నగరంలోనూ సప్లై అవుతున్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి మూడో జాబితా విడుదల

- 13 ఎంపి, 11 అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అభ్యర్థుల మూడో జాబితా విడుదలైంది. ఈ జాబితాలో అసెంబ్లీ స్థానాలతో, లోక్‌సభ స్థానాలకూ టిడిపి అభ్యర్థులను ప్రకటించింది. 13 లోక్‌సభ, 11 శాసనసభ స్థానాలకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు శుక్రవారం జాబితా విడుదల చేశారు. ఇంకా ఐదు శాసనసభ, నాలుగు ఎంపి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ప్రజాభిప్రాయం మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి ప్రకటిస్తున్నామని, ప్రజలు ఆశీర్వదించాలని చంద్రబాబు శుక్రవారం ఎక్స్(ట్విట్టర్)లో కోరారు.

శాసన సభ అభ్యర్థుల వివరాలు

క్రమ సంఖ్య	నియోజకవర్గం	అభ్యర్థి పేరు
1	పలాస	గౌతు శిరీష
2	పాతపట్నం	మామిడి గోవింద్‌రావు
3	శ్రీకాకుళం	గొండు శంకర్
4	శృంగవరపు కోట	కోళ్ల లలిత కుమారి
5	కాకినాడ సిటీ	వనమాడి వెంకటేశ్వరరావు
6	అమలాపురం (ఎస్‌సి)	అయితాబత్తుల ఆనందరావు
7	పెనమలూరు	బోడె ప్రసాద్
8	మైలవరం	వసంత వెంకటకృష్ణప్రసాద్
9	నరసరావుపేట	చదలవాడ అరవింద్ బాబు
10	చీరాల	మద్దులూరి మాలకొండయ్య యాదవ్
11	సర్వేపల్లి	సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

లోక్‌సభ అభ్యర్థుల వివరాలు

క్రమ సంఖ్య	నియోజకవర్గం	అభ్యర్థి పేరు
1	శ్రీకాకుళం	కింజరాపు రామ్మోహన్‌నాయుడు
2	విశాఖపట్నం	మాత్కుపల్లి భరత్
3	అమలాపురం (ఎస్‌సి)	గంటి హరీష్ మాధుర్
4	ఏలూరు	పుట్టా మహేష్ యాదవ్
5	విజయవాడ	కేశినేని శివనాథ్ (చిన్ని)
6	గుంటూరు	పెమ్మసాని చంద్రశేఖర్
7	నరసరావుపేట	లావు శ్రీకృష్ణదేవరాయలు
8	బాపట్ల (ఎస్‌సి)	టి కృష్ణప్రసాద్
9	నెల్లూరు	వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి
10	చిత్తూరు	దగ్గుమళ్ల ప్రసాద్‌రావు
11	కర్నూలు	బస్తిపాటి నాగరాజు
12	నంద్యాల	బైరెడ్డి శబరి
13	హిందూపూర్	బికె పార్థసారథి

దొంగే దొంగ అన్నట్లుగా వుంది

- 'విశాఖ డ్రగ్స్'పై సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ పోర్టులో పట్టుబడ్డ డ్రగ్స్ వ్యవహారంలో దొంగే దొంగ..దొంగ అన్నట్లుగా తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ డ్రగ్స్ వ్యవహారంలో తెలుగుదేశం, బిజెపి నేతల పాత్ర వున్నట్లు కనిపిస్తోందని చెప్పారు. తప్పించుకునేందుకే తమప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని విమర్శించారు.. డ్రగ్స్ దొరికన కంపెనీలో పురందరేశ్వరి కుమారుడు, ఆమె వియ్యంకుడు డైరక్టర్లుగా వున్నారని తెలిపారు. అలాగే చంద్రబాబు నాయుడు బంధువుల పాత్ర కూడా వుందన్నారు. వాస్తవాలు ఇలా వుంటే తమ ప్రభుత్వంపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, తప్పుడు ఆరోపణలు బాధ్యతారాహిత్యంగా చేస్తున్నారని విమర్శించారు. విశాఖ పోర్టులో సిబిఐ డ్రగ్స్‌ను సీజ్ చేసింది పురంధేశ్వరి బంధువులకు చెందిన కంపెనీలనే అనే అంశం స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. తెలుగుదేశం నేత చంద్రబాబునాయుడు వ్యవస్థల మీద గౌరవం లేని వ్యక్తిలా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో గంజాయి, డ్రగ్స్‌పై తూతు మంత్రంగా దాడులు చేశారని అన్నారు. డ్రగ్స్ నిందితులందరికీ తెలుగుదేశం నేతలతో సంబంధాలు ఉన్నాయని విమర్శించారు. ఈ డ్రగ్స్ విషయంలో నిజాలు నిగ్గుతేల్చేందుకు సిబిఐకి లేఖ రాస్తామని తెలిపారు. అలాగే ఎన్నికల కమిషన్‌కూడా దృష్టి సారించాలని కోరారు. డ్రగ్స్ కంటైనర్ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కేంద్ర దర్యాప్తు సంస్థలన్నింటిని కోరుతామని తెలిపారు.

చంద్రబాబు ట్వీట్‌పై చర్యలు తీసుకోండి : సిఇఒకు వైసిపి ఫిర్యాదు

విశాఖ పోర్ట్సు డ్రగ్స్ కేసులో ఎలాంటి ఆధారాలూ లేకుండా అవాస్తవాలతో వైసిపిపై చంద్రబాబు చేసిన ట్వీట్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వైసిపి కోరింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను వైసిపి నేతలు కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని, లేళ్ల అప్పిరెడ్డి, మల్లాది విష్ణు, మనోహర్ రెడ్డి, నారాయణ మూర్తి కలిసి డ్రగ్స్ కేసులో చంద్రబాబు, నారా లోకేష్, పురంధేశ్వరి బంధువులు వున్నారని, వీరి పాత్రపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఎన్నికల్లో అసాంఘిక శక్తులను ప్రోత్సహించేందుకే వారు ఈ డ్రగ్స్‌ను తెప్పించే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు చెక్కులు పంచిపెడుతున్నారని, ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పుడు కథనాలపై ప్రజాశక్తి ఫిర్యాదు

- విచారణకు ఆదేశించిన ఎడిజిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాశక్తి పేరుతో తప్పుడు కథనాలు తయారు చేసి సోషల్ మీడియా గ్రూపుల్లో ఫార్వార్డ్ చేయడంపై సంస్థ సిఐడికి ఫిర్యాదు చేసింది. వాటిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరింది. విశాఖలో భారీ ఎత్తున డ్రగ్స్ దొరికిన నేపథ్యంలో 22వ తేదీన ప్రజాశక్తి ప్రచురించినట్లు అమరావతి బ్యూరో పేరుతో 'విశాఖ డ్రగ్ కేసులో చంద్రబాబు గ్యాంగ్' 'విశాఖ తీరంలో 25 వేల కేజీల కొకైన్‌తో పట్టుబడ్డ ముఠా' అనే పేరుతో ఒక కథనాన్ని తయారు చేసి సోషల్ మీడియాలో ఫార్వార్డ్ చేస్తున్నారు. ప్రజాశక్తి పేరుతో చంద్రబాబు, పురంధేశ్వరిపై వ్యక్తిగతంగా దాడి చేశారు. ఆ పద్ధతుల్లో తప్పుడు కథనాలను ప్రజాశక్తి ఎప్పుడూ ప్రచురించదు. ఈ నేపథ్యంలో సంస్థ పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే ఇటువంటి కథనాలు తయారు చేసి ఫార్వార్డ్ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఐడి అదనపు డిజికి ప్రజాశక్తి బ్యూరోచీఫ్ సురేష్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎడిజిపి అదేశాలు జారీచేశారు. ఇదే విషయమై ప్రజాశక్తి శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి భీమారావు ఆ జిల్లా ఎస్‌పికి కూడా ఫిర్యాదు చేశారు. దర్యాప్తు జరుగుతోంది.

సమగ్ర దర్యాప్తు జరపండి

మొదటిపేజి తరువాయి

గతంలో గుజరాత్ రాష్ట్రం ముంద్రా పోర్టులో పట్టుబడిన వేల కోట్ల విలువైన హెరాయిన్ విజయవాడ చిరునామాతోనే ఆఫ్ఘనిస్తాన్ నుండి వచ్చిందని గుర్తు చేశారు. గంజాయి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ మారిపోతోందని, డ్రగ్స్ మత్తులో యువత చిత్తు అవుతోందని, ఎన్నికల సమయంలో వేల కోట్ల రూపాయల మాదక ద్రవ్యాలు పట్టుబడటం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. కంటైనర్‌ను దిగుమతి చేసుకున్న సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ దిగుమతిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

విశాఖను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారు : పట్టాభిరామ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖను సిఎం వైఎస్ జగన్ డ్రగ్స్ రాజధానిగా మార్చారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖలో వైసిపి నేత కూనం పూర్ణచంద్రరావు సోదరుడు వీరభద్రరావుకు చెందిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ బ్రెజిల్ నుంచి 25 వేల కిలోల డ్రైడ్ ఈస్ట్‌తో కలిపి ఉన్న డ్రగ్స్ సిబిఐకి పట్టుబడ్డాయని తెలిపారు. ఈ కంటెయినర్ తనిఖీ చేయకుండా కొందరు రాష్ట్ర ఉన్నతాధికారులు అడ్డుపడ్డారని సిబిఐ తన నివేదికలో పేర్కొందని చెప్పారు. వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి బ్రెజిల్ దేశ అధ్యక్షుడికి శుభాకాంక్షలు ఎందుకు చెప్పారో ఆ దేశం నుంచి వచ్చిన డ్రగ్ కంటెయినర్‌తో బయటపడిందని ఆరోపించారు.

ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలను వైసిపి అభ్యర్థులు ప్రలోభ పెడుతున్నారని తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ అధ్యక్షులు ఆచంట సునీత విమర్శించారు. విజయవాడ సెంట్రల్, పెనమలూరు, శ్రీకాకుళం, చంద్రగిరి నియోజకవర్గాల్లో వైసిపి అభ్యర్థులు ఓటు వేస్తే అన్నీ ఇస్తామంటూ ప్రలోభాలు పెట్టడంతోపాటు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు.

పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ నగదు

- పల్నాడు, శ్రీకాకుళం జిల్లాలో లక్షల్లో డబ్బు సీజ్

ప్రజాశక్తి- చిలకలూరిపేట (పల్నాడు జిల్లా), వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

ఎన్నికల విధుల్లో భాగంగా నిర్వహిస్తున్న తనిఖీలలో పల్నాడు, శ్రీకాకుళం జిల్లాల్లో నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని గోగుల్ సీతారామయ్య నగర్‌కు చెందిన అరవపల్లి శ్రీనివాసరావు రూ.13.5 లక్షలను జ్యూట్ బ్యాగులో పెట్టుకుని చిలకలూరిపేటలోని ఎన్ఆర్‌టి సెంటర్‌లో విజయవాడ-బెంగళూరు ప్రయివేటు ట్రావెల్స్ బస్సులో గురువారం రాత్రి ఎక్కారు. చిలకలూరిపేట పరిధిలోని వసుమద్రు వద్ద జాతీయ రహదారిపై రూరల్ ఎస్ఐ జి రవికృష్ణ, ఎక్సైజ్ ఎస్ఐ శశికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. ఈ నేపథ్యంలో ట్రావెల్స్ బస్సులో శ్రీనివాసరావు వద్ద నగదును గుర్తించారు. సరైన ఆధారాలు, బిల్లులు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఆదాయపన్ను శాఖాధికారులకు అప్పగించారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం సత్రశాల నాగార్జునసాగర్ టైల్‌పాండ్ ప్రాజెక్టు మీద తెలంగాణలోని అడవిదేవులపల్లి ఎస్ఐ హరిబాబు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలలో మల్లవరం నుండి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సకినాల నరేష్ వద్ద రూ. 2.69 లక్షలు పటు పోలీసులు తనిఖీలు చేశారు. నగదును నల్గొండ కలెక్టరేటికలోని ట్రెజరీ కార్యాలయంలో అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో శ్రీకాకుళం బెండి గేటు వద్ద శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళుతున్న కారును ఫ్లయింగ్ స్క్వాడ్ నిర్వహించిన తనిఖీల్లో కారులో అర్ రాజు వద్ద రూ.2.70 లక్షల నగదు లభ్యమైంది. సరైన ఆధారాలు చూపించకపోవడంతో నగదును వజ్రపుకొత్తూరు పోలీసులకు అప్పగించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పట్టుబడిన నగదును స్థానిక తహశీల్దార్ సమక్షంలో సీజ్ చేసి జిల్లా ట్రెజరీకి తరలించారు. రూ.50 వేలుకు మించి నగదుతో ప్రయాణం చేసేవారు సరైన ఆధారాలు తమ వెంట తెచ్చుకోవాలని ఫ్లయిండ్ స్క్వాడ్ అధికారి భరత్‌రెడ్డి స్పష్టం చేశారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

- సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కరువు మండలాల్లో తాగునీరు, ఉపాధిహామీ పనుల కల్పనలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కరువు మండలాల్లో ఉపాధిహామీ పనులు, తాగునీటి సరఫరాపై శుక్రవారం, ఎన్‌టిఆర్ ప్రకాశం, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, జలవనరులు, విపత్తుల నిర్వహణ శాఖల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధిహామీ పథకం పనులను ఉదయం 5.30గంటల నుంచి 10.30 గంటల వరకు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఎద్దడి ప్రాంతాల్లో ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు.జలవనరులు, పంచాయితీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ కరువు మండలాల్లో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు వారం రోజుల్లో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల వారీగా జలవనరులు, ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్ శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడంతోపాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ట్యాంకుల ద్వారా మంచినీటిని సరఫరా చేసే వాహనాలన్నింటికీ జియో ట్యాగింగ్ చేసి, మంచినీటి వృథాను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కరువు ప్రభావిత 9 జిల్లాల కలెక్టర్లు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రజలకు కల్పిస్తున్న పనులు, మంచినీరు సరఫరా చేస్తున్న విధానాలను సిఎస్‌కు వివరించారు. ఈ సమావేశంలో పంచాయితీరాజ్‌శాఖ కమిషనరు కె.కన్నబాబు, విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ఆర్ కూర్మనాథ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఎన్‌సి కృష్ణారెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు జలవనరులశాఖ ఇఎన్‌సి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పెంచలకోనలో 'చంద్రబాబు'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు శుక్రవారం నెల్లూరు జిల్లా పెంచలకోన నరసింహస్వామిని సందర్శించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించాలని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో రాపూరు మండలం గోనుపల్లికి చేరుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం తిరిగి ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు.

కేసుల వివరాలివ్వండి

- సిఇఒకు టిడిపి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ నేతలపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలివ్వాలని టిడిపి కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను శుక్రవారం సచివాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, బొండా ఉమామహేశ్వరరావు కలిసి వినతిపత్రం అందించారు. కొంతమంది పోలీస్ అధికారులు తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. జిల్లాల ఎస్‌పిలకు లేఖలు రాసినా సమాచారం రాలేదని అన్నారు. కేసుల వివరాలివ్వాలని డిజిపికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

డ్రగ్స్‌తో రాజకీయ ప్రకంపనలు

మొదటిపేజి తరువాయి

తెలిపింది. ఈ మేరకు కొన్ని ఫోటోలను కూడా వైసిపి తనఫేస్‌బుక్, ట్విటర్‌ఖాతాల్లో పెట్టింది. శుక్రవారం నాడు కూడా ఈ పరస్పర విమర్శలు కొనసాగాయి. వైసిపి బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేసింది. సంధ్య అక్వా ఎండికి బిజెపికి రాష్ట్ర బిజెపికి చెందిన అగ్రనేతకు సమీప బంధుత్వం ఉన్నట్లు కూడా వస్తున్న వార్తలు చర్చనీయాంశమైనాయి. ఆ అగ్రనేతకు చంద్రబాబునాయుడి కుటుంబానికి కూడా దగ్గరి సంబంధాలు ఉండటం చర్చనీయాంశంగా మారింది. సంధ్యా అక్వాకు మరికొన్ని కంపెనీలు కూడా ఉన్నాయని వాటిలో ఒక దానికి బిజెపి అగ్ర నేతకుమారుడు డైరక్టర్‌గా ఉన్నారని వార్తలు వస్తున్నాయి. దీనికి తగ్గట్టుగానే ఇంటర్‌పోల్ నుండి సమాచారం వచ్చిన కొన్ని రోజులకుగానీ సిబిఐ అధికారులు దాడులు చేయకపోవడం, దాడి జరిగిన తరువాత రోజుల తరబడి సమాచారాన్ని బయటపెట్టకపోవడం పలు అనుమానాలకు దోవతీస్తుంది. సంధ్యా అక్వా ఎండి ని విమానంలో లైంగిక వేధింపులనేరం కింద 2016లో అరెస్ట్ చేసినట్లు చెబుతున్నారు.

విలువ ఎంత...?

విశాఖ పోర్టులో 25 వేల కిలోల డ్రగ్స్ పట్టుబడిన సంగతి తెలిసిందే. దీనిని కొకైన్‌గా ప్రాథమికంగా సిబిఐ అధికారులు నిర్ధారణ చేసి, ఆ మేరకు రిపోర్టులో కూడా పొందుపరిచారు. దీని విలువను అధికారికంగా ప్రకటించలేదు. అయితే,సుమారుగా 50 వేల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ప్రస్తుతం విశాఖ కంటైనర్ టెర్మినల్ జెఎన్ బక్షీ అనే ముంబాయి సంస్థ ఆధీనంలో ఉంది. ఆ సంస్థకు, సంధ్యా అక్వాకు మధ్య ఉన్న సంబంధాలేమిటో వెలుగులోకి రాలేదు. కంటైనర్‌ను స్కాన్‌చేసి లోపలి సరుకును నిర్ధారించాల్సిఉండగా, ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉండటంలో అది సాధ్యం కావడం లేదని చెబుతున్నారు. దేశంలో ప్రైవేటు పోర్టులు డ్రగ్స్‌కు అడ్డాలుగామారుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం అదాని ముంద్రా పోర్టు నుండి 25 వేల కోట్ల రూపాయల విలువైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. విశాఖ పోర్టులో ఈ తరహా వ్యవహారాలు దేశ రక్షణకు హాని కరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణ బిజెపి నేతకు టిడిపి బాపట్ల ఎంపీ టికెట్

మొదటిపేజి తరువాయి

వ్యక్తం చేయకపోవడంతో చీపురుపల్లి, భీమిలి స్థానాలు పెండింగ్‌లో పెట్టారు. మరో మాజీమంత్రి కిమిడి కళా వెంకట్రావు ఎచ్చెర్ల నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ మరో నేత అప్పలనాయుడు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. మాజీ మంత్రులు బండారు సత్యనారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీతల సుజాత, జవహర్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ వంటి నేతలు కూడా టికెట్లు రాకపోవడంతో అసంతృప్తిలో ఉన్నారు.

నేడు అభ్యర్థులతో చంద్రబాబు వర్క్‌షాపు

టిడిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులతో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వర్క్‌షాపు నిర్వహించనున్నారు. విజయవాడలోని ఎ వన్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఈ కార్యక్రమం జరగనుంది. ఎన్నికల ప్రచారం, సూపర్ సిక్స్ మినీ మ్యానిఫెస్టో వంటి అంశాలపై అభ్యర్థులకు చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు.

తండ్రి మృతి.. విద్యార్థి పరీక్షకు హాజరు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

కన్నతండ్రి గుండెపోటుకు గురై మృతి చెందగా, బరువెక్కిన గుండెతో ఒక విద్యార్థి పదో తరగతి పరీక్షకు హాజరైన సంఘటన పార్వతీపురం మండలం నర్సిపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గిరిజన కుటుంబానికి చెందిన ఎన్ సీతారాం (45) కోళ్ల ఫారంలో పనిచేస్తున్నారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు వినయ్ సురేష్ పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సీతారాం ఆకస్మికంగా గుండెపోటుతో ఇంటి వద్దే మృతి చెందారు. పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలోని డివియం హైస్కూల్లో వినయ్ సురేష్ పరీక్ష రాయాల్సి ఉంది. తన తండ్రి మరణించడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉన్న ఆ విద్యార్థికి తల్లి సీతమ్మ ధైర్యం చెప్పి పరీక్ష రాయడానికి స్నేహితులను తోడుగా ఇచ్చి పంపించింది. పరీక్ష ముగిసిన తరువాత తండ్రి అంత్యక్రియల్లో విద్యార్థి పాల్గొన్నాడు.

కలసపాడులో చెంచిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న భువనేశ్వరి

వైసిపి అరాచకాలను తిప్పికొట్టాలి : నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-కలసపాడు (వైఎస్ఆర్ జిల్లా)

జగన్‌మోహన్‌రెడ్డి చేసే నియంతృత్వ పరిపాలనను, అరాచకాలను ప్రజలు ఓటు అనే ఆయుధంతో తిప్పి కొట్టాలని చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కోరారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా ఆమె శుక్రవారం వైఎస్ఆర్ జిల్లాల్లో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. బి.కోడూరు మండలం గుంటపల్లికి చెందిన ఓబుల్‌రెడ్డి, కలసపాడు మండలం లింగారెడ్డిపల్లెకు చెందిన సగిలి డేవిడ్, బ్రాహ్మణపల్లెకు చెందిన నల్లగుండ్ల వెంకటయ్య, తెల్లపాడుకు చెందిన బసిరెడ్డి చెంచిరెడ్డి కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి రాష్ట్ర యువ నాయకులు రితీష్‌రెడ్డి, పాల్గొన్నారు.

పెట్రో యూనివర్సిటీపై కేంద్రం నిర్లక్ష్యం

- ఎనిమిదేళ్లవుతున్నా ప్రాథమిక దశలోనే పనులు
- ఎయులో అరకొర వసతుల మధ్య తరగతులు

సబ్బవరం మండలం వంగలిలో ప్రాథమిక దశలోనే ఉన్న పెట్రోలియం యూనివర్సిటీ నిర్మాణ పనులు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలిలో జాతీయ విద్యా సంస్థ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం, ఎనర్జీ (ఐఐపిఇ - పెట్రోలియం యూనివర్సిటీ) ఏర్పాటుకు శంకుస్థాపన జరిగి ఎనిమిదేళ్లు కావస్తున్నా నేటికీ ప్రాథమిక దశలోనే పనులు ఉన్నాయి. నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వ జాప్యమే ఇందుకు కారణం. ఆంధ్ర యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వసతి సమస్య వల్ల పూర్తి స్థాయిలో విద్యార్థులను చేర్చుకోలేని పరిస్థితి ఉంది. రాష్ట్రానికి 11 అత్యున్నత విద్యా సంస్థలను ఇచ్చామని పల్నాడు జిల్లా బొప్పూరులో ఈ నెల 17న బిజెపి, టిడిపి, జనసేన ఆధ్వర్యాన జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో ప్రధాని మోడీ గొప్పగా చెప్పుకొచ్చారు. పెట్రోలియం యూనివర్సిటీ పరిస్థితి చూస్తే ఈ ప్రకటనలో డొల్లతనం అర్థమవుతోంది. రాష్ట్ర పునర్విభజనం చట్టం ప్రకారం ఈ యూనివర్సిటీ నిర్మాణ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. రాష్ట్ర ప్రభుత్వం 201.8 ఎకరాలను యూనివర్సిటీ కోసం అప్పగించింది. 2016 అక్టోబర్‌లో రూ.600 కోట్ల విలువైన పనులకు అప్పటి కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శంకుస్థాపన చేశారు. నిర్మాణంలో జాప్యం వల్ల వ్యయం అంచనా రూ.855 కోట్లకు పెరిగింది. ఇప్పటి వరకూ దఫదఫాలుగా రూ.300 కోట్లను మాత్రమే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ప్రహరీ నిర్మాణం పూర్తి కాగా, భవన నిర్మాణాలు నేటికీ ప్రాథమిక దశలోనే ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దీనికనుగుణంగా ప్రధాని మోడీ ఈ నెల రెండున వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అవసరమైన నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేసి సకాలంలో పనులు పూర్తి చేసి ఉంటే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రస్తుతం ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో పెట్రోలియం యూనివర్సిటీ తరగతులను 350 మంది విద్యార్థులతో పరిమితంగా నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీ భవనాలు పూర్తయి ఉంటే 950 మంది విద్యార్థులు చదువుకొనే వీలు కలిగేది. ప్రస్తుతం జరుగుతున్న తొలి దశ నిర్మాణ పనులు 2025 జులై నాటికి పూర్తవుతాయని అధికారులు చెప్తున్నారు.

పౌరసరఫరాలశాఖ ఎమ్‌డి వీరపాండ్యన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ధాన్యం బకాయిలు చెల్లించాలి

- పౌరసరఫరాలశాఖ ఎమ్‌డికి కౌలురైతు సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌బికెల ద్వారా ధాన్యం అమ్ముకున్న రైతులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, నాయకులు పంచకర్ల రంగారావు, మాదు నాగేశ్వరరావు, పెదపూడి శ్రీను, పి బుజ్జి, కె నాంచారయ్య తదితరులు పౌరసరఫరాలశాఖ ఎమ్‌డి వీరపాండ్యన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఖరీఫ్‌లో కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు, కాటా కూలీ రవాణా ఛార్జీలు వెంటనే ఇవ్వాలని కోరారు. ఆఫ్‌లైన్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆఫ్‌లైన్ చేసి బకాయిలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. గత ఖరీఫ్ సీజన్లో పెండింగ్‌లో ఉన్న కాటా కూలీ రవాణా ఛార్జీలూ విడుదల చేయాలని కోరారు.

టాటా ఎఐఎ నుంచి రైజింగ్ ఇండియా ఫండ్

ముంబయి : జీవిత బీమా సంస్థల్లో ఒకటైన టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఎఐఎ) కొత్తగా టాటా ఎఐఎ రైజింగ్ ఇండియా ఫండ్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ కొత్త ఫండ్ ఆఫరింగ్ (ఎన్ఎఫ్ఒ) మార్చి 31 వరకు తెరిచి ఉంటుందని.. అదే రోజు యూనిట్ల జారీ ఉంటుందని పేర్కొంది. తమ సంస్థ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా ఈక్విటీ మార్కెట్ దీర్ఘకాలిక వృద్ధి సంభావ్యత నుండి తమ వినియోగదారులు ప్రయోజనం పొందుతున్నారని టాటా ఎఐఎ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ హర్షద్ పాటిల్ తెలిపారు. 2024 ఫిబ్రవరి ముగింపు నాటికి సంస్థ మొత్తం ఆస్తి (ఎయుఎం) రూ.96,532 కోట్లుగా ఉందన్నారు.

వర్ధన చేతికి ఐఎస్ఎఫ్‌సి స్కూల్ పోర్టుపోలియో

హైదరాబాద్ : భారత్‌లో విద్యా రంగానికి ఫైనాన్స్ చేసే స్కూల్ ఫైనాన్స్ కంపెనీ (ఐఎస్ఎఫ్‌సి)కి చెందిన స్కూల్ పోర్టుపోలియోను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌బిఎఫ్‌సి వర్ధనా ఫైనాన్స్ తెలిపింది. ప్రయివేటు పాఠశాలలు, విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించడానికి వర్ధన రుణాలు అందిస్తుంది. తమ నిర్ణయం ఈ రంగంలో కీలకమైన మలుపును సూచిస్తుందని వర్ధన ఫైనాన్స్ పేర్కొంది. ఈ స్వాధీనంతో దేశంలోని 4 లక్షల ప్రయివేటు పాఠశాలలకు మద్దతునందించనున్నట్లు వర్ధన సిఇఒ, కో ఫౌండర్ స్టేవ్ హర్డ్‌గ్రవ్ తెలిపారు.

బిజెపి విధానాలు దేశానికి ప్రమాదకరం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - తణుకురూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తోన్న విధానాలు ప్రజానీకానికి, సమాజానికి ప్రమాదకరమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని గద్దెదించాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని ఎన్‌జిఒ హోమ్‌లో సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజెపి పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదని, ఉన్న ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను విదేశీ కంపెనీకి కట్టబెట్టాలని ప్రయత్నిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి పడిపోయిందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు వచ్చాయని చెప్పుకోవడమే తప్ప స్థాపించిన దాఖలాలు లేవని విమర్శించారు. ఒకప్పుడు తణుకు ప్రఖ్యాతగాంచిన పారిశ్రామిక కేంద్రమని తెలిపారు. నాటి వైభవం నేడు మసకబారిందని అన్నారు. పారిశ్రామిక అభివృద్ధి లేకుండా ఏ రాష్ట్రం కూడా ముందుకెళ్లదన్నారు. బిజెపి కార్మిక, రైతాంగ వ్యతిరేక ప్రభుత్వమని, కార్మికులకు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి స్వాతంత్రం ముందు నుంచి ఉన్న హక్కులను కాలరాస్తోందని తెలిపారు. లేబర్ వ్యవస్థ అంతా నిర్వీర్యమైపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయం మొత్తాన్ని కార్పొరేట్ చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో మోడీ విధానాలను తిప్పికొట్టాలని కోరారు. రాష్ట్రంలో బిజెపికి మద్దతు తెలుపుతున్న వైసిపి, టిడిపి, జనసేనను ఓడించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, నాయకులు నీలాపు ఆదినారాయణబాబు, గుబ్బల గోపి పాల్గొన్నారు.

మిమ్స్ హెల్త్ కేర్ సెంటర్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మిమ్స్ హెల్త్‌కేర్ సెంటర్ వద్ద ఉద్యోగుల నిరసన

- సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం : సిఐటియు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని 52 రోజులుగా ఆందోళన చేస్తున్నా మిమ్స్ యాజమాన్యం నిర్లక్ష్యం వహించడంతో విజయనగరంలోని మిమ్స్ హెల్త్‌కేర్ సెంటర్ వద్ద ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. విధులకు వచ్చిన వైద్యులను అడ్డుకొని ఆస్పత్రి లోపలికి వెళ్లనీయ కుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, నాయకులు టివి రమణ మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులకు వేతన ఒప్పందం చేయాలని, బకాయి డిఎలను ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారంపై యాజమన్యాం చర్చలకు పిలవకుండా ఉద్యోగులను బెదిరించడం, ఉద్యోగాల నుంచి తొలగించడం వంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు.

వెంటనే యాజమ్యానం స్పందించి చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిఘాపై 3న ప్రత్యేక సమీక్ష

- సిఇఒ ముఖేష్‌కుమార్‌మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో పటిష్టంగా నిఘా వ్యవహరించడం, అక్రమ నగదు, సరుకు రవాణాను అడ్డుకోవడం, స్వాధీనం చేసుకోవడం తదితర అంశాలపై ఏప్రిల్ 3వ తేదిన కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహించనుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా తెలిపారు. దీనికోసం రూపొందించిన ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వినియోగాన్ని విస్తృతస్థాయిలో మెరుగుపరచాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిఘా పై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను అప్రమత్తంచేయాలని, జిల్లా పరిధిలోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో కూడా పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కనీసం ఒక కెమెరాతో స్టాటిక్ సర్వలెన్స్ టీమ్‌ను ఉంచాలని ముఖేష్‌కుమార్‌మీనా పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం 33 నిత్యావసర సేవల శాఖలకు ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ముఖ్యంగా పోలీస్, విద్యుత్తు, రవాణా, పోస్టల్ శాఖలు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులతో పాటు ఆయా శాఖల ఉద్యోగులకు వారి విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయపార్టీలు నిర్వహించే ఎటువంటి కార్యక్రమమైనా ముందుగా అనుమతి తప్పని సరిగా పొందాల్సి ఉందన్నారు. నేరుగా కానీ, ఎన్కోర్(పోర్టల్) ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవాలని, వాటిని వెంటనే పరిశీలించి సకాలంలో అనుమతులను మంజూరు చేస్తామని చెప్పారు. శాంతి భద్రతల నిర్వహణ విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి దుర్ఘటలనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నూతన ఓటర్ల నమోదు విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని, చివరి నిమిషంలో హడావుడిగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టవద్దన్నారు. వ్యక్తిగతంగా దాఖలు చేసిన ఫారమ్-6లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే నూతన ఓటర్లుగా నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు అదనపు సిఇఓలు పి.కోటేశ్వరరావు, ఎమ్ఎన్ హరీంధర్‌ప్రసాద్, జాయింట్ సిఇఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఇఓలు కె.విశ్వేశ్వరరావు, మల్లిబాబు, సెక్షన్ ఆఫీసరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భగత్ సింగ్ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయనగరం తోటపాలెంలోని ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కేంద్రాస్పత్రి మెడికల్ ఆఫీసర్ శిరీష, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బాలాజీ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై పోరాడుతూనే ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎస్ఎఫ్ఐకి మాత్రమే చెల్లిందని, ఆరు నెలలకు ఒకసారి ప్రతి ఏటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుక్‌దేవ్ అని, అటువంటి మహాత్ముల దారిలో నడిచే ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ పోరాటాలు చేస్తూనే, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులకు కళాశాల ప్రిన్సిపల్ చిన్నం నాయుడు అభినందించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె .రవికుమార్, ఎం.హర్ష, డివైఎఫ్ఐ నాయకులు సతీష్ పాల్గొన్నారు.

సన్ రైజర్స్ భాగస్వామిగా ఆరుణ్ ఐస్‌క్రీమ్స్

హైదరాబాద్ : టి20 కప్ 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు అధికారిక ఐస్‌క్రీమ్ భాగస్వామిగా అరుణ్ ఐస్‌క్రీమ్స్ వ్యవహరించనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ భాగస్వామ్యం తమకు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని అరుణ్ ఐస్‌క్రీమ్స్ పేర్కొంది. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలనే తమ నిబద్ధతను ఈ భాగస్వామ్యం బలపరుస్తుందని తెలిపింది.

మున్సిపల్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటాలు

- చిత్తూరు కార్పొరేషన్‌లో భారీగా సిఐటియులో చేరిక

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటాలను ఉధృతం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు భారీ సంఖ్యలో శుక్రవారం ఎఐటియుసి నుంచి సిఐటియు యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్న ఏకైక కార్మిక సంఘం సిఐటియు అని అన్నారు. వారి సమస్యలపై పోరాటాలు చేసి జిఒలు సాధించిన చరిత్ర యూనియన్‌కు ఉందని వివరించారు. అలాంటి సిఐటియులో కార్మికులందరూ చేరడం అభినందనీయమన్నారు. కార్మికులపై పనిభారం పెరుగుతోందని తెలిపారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు చెప్పినట్లు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పోరాటాలను ఉధృతం చేయడం ద్వారా ప్రభుత్వాలు దిగి వచ్చాయన్నారు. జిల్లా కార్పొరేషన్‌లోనూ ప్రభుత్వం ఇచ్చిన జిఒల ప్రకారం అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్రాంతి అలవెన్స్ వెయ్యి రూపాయలు వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశానికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, యూనియన్ నాయకులు నాగరాజు, సుబ్రమణ్యం, గోపీ పాల్గొన్నారు.

పిఠాపురం నుంచే పవన్‌కల్యాణ్ ప్రచారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సాధారణ ఎన్నికల ప్రచారాన్ని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ తాను పోటీ చేస్తున్న పిఠాపురం నుంచే ప్రారంభించనున్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల ప్రచారానికి ప్రణాళికలు అంశంపై పార్టీ నేతలతో పవన్‌కల్యాణ్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఠాపురం నుంచే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. తొలుత వారాహి వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎన్నికల శంఖారావాన్ని పూరించడం జరుగుతుందన్నారు.

తొలి మూడు రోజులు పిఠాపురం నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించడంతో పాటు, నియోజకవర్గ ముఖ్యనాయకులు, మండలస్థాయి నాయకులతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తాను పోటీ చేస్తున్న స్థానం కావడంతో పిఠాపురంపై వైసిపి కుట్రలు పన్నుతోందని, ప్రతి దశలోనూ ఎన్‌డిఎ కూటమి నేతలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనల గురించి టూర్ మేనేజ్‌మెంట్ సభ్యులు పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు బి.మహేంధర్‌రెడ్డి, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనరు కల్యాణం శివ శ్రీనివాస్ పాల్గొన్నారు.

Can Fin Homes Ltd
కెనఫిన్ హోమ్స్ లిమిటెడ్
Tel: 0866-2474781, 2481731. Email: vijayawada@canfinhomes.com.
CIN: L85110KA1987PLC008699. Cell No. 7625079119.
స్థిరాస్తి అమ్మకం కొరకు వేలం ప్రకటన
(www.canfinhomes.com) ... http://www.canfinhomes.com/searchaution.aspx.
తేది : 22-03-2024
స్థలము : విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనఫిన హోమ్స్ లిమిటెడ్.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
స్వాధీనత ప్రకటన

సంపాదకీయం

అరెస్టుల పర్వం

ఎన్నికల బాండ్ల వ్యవహారంలో బిజెపి అవినీతి గుట్టు బట్టబయలు కావడం, మరోవైపున ఇండియా వేదికపట్ల నానాటికీ సానుకూలత పెరగడంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను వేటాడడమే పనిగా పెట్టుకున్నదని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో విదితమవుతోంది. భారీ బందోబస్తుతో నాటకీయ పరిణామాల మధ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ గురువారం అర్ధరాత్రి కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో అరెస్టు చేసింది. ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలన్నిటిని ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన రోజునే ఇడి ఈ చర్యకు పాల్పడడం గమనార్హం. బిజెపిని ఓడించడానికి తీవ్ర కృషి చేస్తున్న ఇండియా వేదిక పార్టీలకు చెందిన ముఖ్యమంత్రుల్లో కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్మార్గ అరెస్టుకు గురైన రెండవ వ్యక్తి అరవింద్ కేజ్రీవాల్. గతంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌ను ఢిల్లీ నుండి రాంచీ వరకు వెంటాడి మరీ అరెస్టు చేయగా ఇపుడు కేజ్రీవాల్‌ను ఢిల్లీలో నిషేధాజ్ఞలమధ్య నిర్బంధించారు. చట్టాన్ని తు.చ. తప్పక అమలు చేయవలసిన కేంద్ర దర్యాప్తు సంస్థలు కక్షగట్టి ప్రతిపక్ష నాయకులను కటకటాలవెనక్కు నెట్టడం హేయమైన చర్య. మోడీ సర్కారు నిరంకుశత్వ విశృంఖలత్వానికివి కొన్ని దృష్టాంతాలు మాత్రమే! ఇడి ఒక దర్యాప్తు సంస్థగా కన్నా బిజెపి చేతిలో రాజకీయ ఆయుధంగా పనిచేస్తోందనడం సరిగ్గా సరిపోతుంది. దేశం నలుమూలలలా వున్న బిజెపి వ్యతిరేక పార్టీలు, సంస్థలు, ప్రముఖులూ అరెస్టును రాత్రికి రాత్రే ఖండించడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్న తపనకు నిదర్శనాలు.

ఢిల్లీ ప్రభుత్వం ఏనాడో నిలిపేసిన మద్యం పాలసీ కేసులో ఇడి బలవంతపు చర్యల నుంచి రక్షణ కల్పించాలంటూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీం కోర్టు ముందు పెండింగ్‌లో ఉండగానే ఇడి ఆయనను అరెస్టు చేయడం దిగ్భ్రాంతికరం. ఈ చర్యపై ఆగ్రహిస్తూ ఆప్ శ్రేణులు, ఢిల్లీ ప్రజలు నిరసన ప్రదర్శనలు చేస్తే వాటిని అడ్డుకోవడానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఢిల్లీ పోలీసులు నగరమంతటా నిషేధాజ్ఞలు జారీ చేయడం, ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టడం అప్రజాస్వామికం. కేజ్రీవాల్ జైలు నుండి ప్రభుత్వాన్ని నడుపుతారని, ఆయన ఢిల్లీ ముఖ్యమంత్రిగానే కొనసాగుతారనీ ఆప్ నేతలు చెబుతున్నారు. ఇదే కేసులో ఇంతకుముందు ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆప్ నేత సంజయ్ సిన్హాలను ఇడి అరెస్టు చేసింది. ఇప్పుడు కేజ్రీవాల్‌ను కూడా జైలుకు పంపడం ద్వారా ఆప్‌లో నాయకత్వ కొరతను సృష్టించాలన్నది బిజెపి యత్నం. అంతేగాక కేసులు, అరెస్టులు చూపి ఢిల్లీ ప్రభుత్వాన్ని సైతం కూల్చి రాష్ట్రపతి పాలన విధించాలన్న కుట్ర పన్నుతోంది. ఆ విధంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న దుర్బుద్ధి కూడా కమలదళానికి ఉంది. ఎన్నికల బాండ్లలో పాలక పార్టీ అవినీతి బట్టబయలు కావడంతో దానిపై చర్చను దారి మళ్లించాలన్నదీ దాని మాస్టర్ ప్లాన్!

ప్రజల సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడం, దానికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించకుండా ఉండడానికి ఏకరూప పౌరస్మృతిని తీసుకురావడం, సిఎఎ రూల్స్ నోటిఫై చేయడం వంటి చర్యలతో మోడీ సర్కారు మత విద్వేషాలను రెచ్చగొడుతోంది. మరోవైపున ప్రజల జీవన స్థితిగతులు నానాటికీ దిగజారడంతో జనంలో వ్యతిరేకత క్రమంగా పెరుగుతోంది. ముదనష్టపు కార్పొరేట్ మతతత్వ కూటమిని గద్దె దించాలన్న కృత నిశ్చయానికి వస్తున్నారు. పర్యవసానంగా ఇండియా వేదికకు ప్రజాదరణ పెంపొందుతోంది. సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరిగితే తమ ఓటమి తప్పదన్న భయంతోనే రాజకీయ పత్యర్థులను వెంటాడి వేధించే చర్యలకు బిజెపి తెగబడుతోంది. ప్రతిపక్ష పార్టీలను, వాటి నాయకులనూ నిర్బంధించడం, ఆయా పార్టీల అకౌంట్లు సీజ్ చేయడం, రకరకాల ఆంక్షలు విధించడం కక్ష సాధింపు చర్యలే. దేశ ప్రజలంతా ప్రతిపక్ష పార్టీలకు బాసటగా నిలిచి కేంద్ర బిజెపి ప్రభుత్వ దుశ్చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. ఎన్నికల్లో ఓడించి దుష్ట పాలనను తుదముట్టించాలి!

మంచి మాట



ఈ మంత్రములు, జపమాలలు విడిచిపెట్టు.
తలుపులన్నింటినీ బంధించి ఈ చీకటి గదిలో
ఎవరిని పూజిస్తున్నావు? కళ్ళు తెరచి చూడు.
నీవు ఆరాధించే దేవుడు నీ ఎదుట లేడు!
ఎక్కడ రైతు నేలను దున్నుతున్నాడో, ఎక్కడ
శ్రామికుడు రాళ్ళు పగులగొడుతున్నాడో
అక్కడ ఆ పరమాత్ముడున్నాడు. నీవు కూడా
నీ పట్టు పీతాంబరములు అవల పెట్టి
ఆ నేల మీదికి పదా ...

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

Rabindranath Tagore

'ఒకే దేశం - ఒకే ఎన్నిక' నియంతృత్వం కోసమే

విశ్లేషణ

కె.యస్. లక్ష్మణరావు

నరేంద్ర మోడీ 2014లో అధికారంలోకి వచ్చాక భారత ప్రజల భిన్నత్వ, బహుళత్వ సంస్కృతిపై దాడి ప్రారంభమైంది. రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాలకు విఘాతం కలిగే విధంగా మోడీ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఒకే రకమైన పన్ను, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే మతం, ఒకే రకమైన తిండి మొదలైనవి ఉండాలని మోడీ ప్రభుత్వం అభిలషిస్తున్నది. వీటితో పాటు 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' పేరుతో లోక్‌సభకు, శాసనసభలకు జమిలి ఎన్నికలు నిర్వహించాలనే ఆతృత వ్యక్తం చేస్తున్నది. గతంలోనే ఆ నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేసిన ప్రసంగంలో జమిలి ఎన్నికలపై రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయానికి రావాలని పిలుపు ఇచ్చారు. ఆ నాటి న్యాయశాఖామంత్రి రవిశంకర ప్రసాద్ న్యాయ వ్యవస్థ కూడా జమిలి ఎన్నికలకు అనుకూలంగా స్పందించాలని కోరారు. లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాధనం ఖర్చు తగ్గిపోతుందని, అభివృద్ధిపై దృష్టి సారించడానికి అవకాశం ఉంటుందని, శాంతిభద్రతల సమస్యలు తగ్గిపోతాయని నరేంద్ర మోడీ అంటున్నారు.

రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు

కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కొంతమంది సభ్యులతో జమిలి ఎన్నికలపై కమిటీని నియమించినది. ఈ కమిటీ జమిలి ఎన్నికలను బలంగా సమర్థిస్తూ కొద్దిరోజుల క్రితం 18,000 పేజీల నివేదికను సమర్పించింది. నరేంద్ర మోడీ కలలు కంటున్న ఒకే దేశం- ఒకే ఎన్నికను ఆచరణ సాధ్యం చేయటానికి వీలుగా నివేదికను రూపొందించింది. రాజ్యాంగంలో ఐదు ఆర్టికల్స్‌ను సవరణ చేయడం ద్వారా జమిలి ఎన్నికలను 2029 నాటికి ఆచరణలోకి తేవచ్చని కమిటీ ప్రతిపాదించింది. లోక్‌సభ, శాసనసభలకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించటం, ఆ తరువాత 100 రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయటం, ఒకే ఓటర్ల జాబితా, ఒకే ఐడెంటిటీ కార్డు మొదలైన ప్రతిపాదనలను ఈ కమిటీ సిఫార్సు చేసింది. 47 రాజకీయ పక్షాలు తమ అభిప్రాయాలను తెలిపాయని, వీటిలో 32 పార్టీలు జమిలి ఎన్నికలకు అనుకూలంగా వున్నాయని ఈ కమిటీ పేర్కొన్నది. మొత్తంమీద ఈ కమిటీ నరేంద్ర మోడీ, అమిత్ షా అభిప్రాయాలకు అనుగుణంగా ఈ నివేదికను రూపొందించింది.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

జమిలి ఎన్నికలు భారత రాజ్యాంగ, సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. భారత రాజ్యాంగంలో ఒకటవ నిబంధన భారతదేశాన్ని 'రాష్ట్రాల యూనియన్'గా పేర్కొన్నది. కేంద్రంతో పాటు రాష్ట్రాలు బలంగా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. రాజ్యాంగం ఏడవ షెడ్యూలులో అధికారాలు కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలుగా విభజించారు. ఈ అధికారాలు అమలు చేయటానికి కేంద్రం, రాష్ట్రాలలో ఒకే పార్టీ వుండాలనే సూత్రం లేదు. అమెరికాలో అధ్యక్షుడు ఒక పార్టీకి చెందితే, రాష్ట్రాలలో గవర్నర్‌లు ఇంకొక పార్టీకి చెందినవారు ఎన్నిక కావటం సాధారణమైన విషయం. మన దేశంలో 1952, 1957, 1962 సాధారణ ఎన్నికలలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల ఎన్నికలలో (1957లో కేరళ మినహాయిస్తే) గెలుపొందింది. 1967 ఎన్నికలలో కాంగ్రెస్ లోక్‌సభలో స్వల్ప మెజారిటీతో అధికారంలోకి వచ్చి, 8 రాష్ట్రాలలో కాంగ్రెస్ ఓటమి చెంది ఇతర పార్టీల ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేంద్రంలో ఒక పార్టీ అధికారంలో వుంటే, రాష్ట్రాలలో భిన్నమైన పార్టీలు అధికారంలో వుంటున్నాయి. ఉదాహరణకు 1980 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఇందిరా గాంధీ నాయకత్వాన కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో వుంటే రాష్ట్రాలలో జ్యోతిబసు, యన్.టి.రామారావు, రామకృష్ణ హెగ్డే, ఫరూక్ అబ్దుల్లా, ఇ.కె.నయనార్ మొదలైనవారు ముఖ్యమంత్రులుగా ఉన్నారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో మార్పు రావాలని, రాష్ట్రాలకు ఇంకా ఎక్కువ అధికారాలు ఉండాలని, ఆర్థిక వనరుల పంపిణీలో రాష్ట్రాలకు ప్రాధాన్యత పెరగాలని ఆ నాడు వారు డిమాండ్ చేశారు. అందువలనే 1983లో ఇందిరా గాంధీ కేంద్ర రాష్ట్ర సంబంధాలపై సర్కారియా కమిషన్‌ను నియమించారు. అందువల్ల జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయి కాబట్టి వాటిని వ్యతిరేకించవలసిన అవసరమున్నది.

> **గత పదేళ్లుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలలో మతపరమైన విభజన తెచ్చే విధంగా, బిజెపి ఆధిపత్యాన్ని పెంచే విధంగా కొనసాగుతున్నాయి. జమ్మూ కాశ్మీర్ 370వ ఆర్టికల్ రద్దు చేయటం, పౌరసత్వ సవరణ చట్టం అమలు చేయటానికి నోటిఫికేషన్ జారీ చేయటం, మైనారిటీలపై దాడులు, రామాలయ నిర్మాణం...మొదలైనవన్నీ ప్రజల మధ్య మతపరమైన విభజన తెచ్చి బిజెపి రాజకీయ ఆధిపత్యాన్ని పెంచుకొనేందుకు చేసిన ప్రయత్నాలే. జమిలి ఎన్నికల ద్వారా తమ ఆధిపత్యాన్ని పెంచుకోవటానికి రాజకీయంగా కేంద్రంలోను అన్ని రాష్ట్రాలలోను తమ ప్రాబల్యం కొనసాగాలని భావిస్తున్నది.**



బహు పార్టీ విధానం - సంకీర్ణ రాజకీయాలు

భారతదేశంలో చారిత్రక పరిస్థితులు, భిన్నత్వం దృష్ట్యా బహు పార్టీ విధానం ఏర్పడింది. జాతీయ ఎన్నికల కమిషన్ రాజకీయ పార్టీలను జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, గుర్తింపు పొందిన పార్టీలుగా గుర్తిస్తున్నది. భారతదేశంలో గత 4 దశాబ్దాలుగా మారిన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులలో అనేక ప్రాంతీయ పార్టీలు ఉనికిలోకి వచ్చాయి. జాతీయ స్థాయిలో 1989లో ప్రారంభమైన సంకీర్ణ రాజకీయాలు 2009 వరకు కొనసాగాయి. 1989, 1991, 1996, 1998, 1999, 2004, 2009 లలో జరిగిన లోక్‌సభల ఎన్నికలలో ఏ ఒక్క పార్టీకీ మెజార్టీ రాలేదు. 1989, 1996, 1998లలో ఏర్పడిన లోక్‌సభలు ముందే రద్దయ్యాయి. జమిలి ఎన్నికలు జరిగినప్పటికి లోక్‌సభ, శాసనసభలు ముందే రద్దుకావనే గ్యారంటీ ఏమున్నది? భారత రాజ్యాంగంలో 83వ నిబంధన లోక్‌సభ, 172వ నిబంధన శాసనసభ ముందే రద్దు కావడానికి అవకాశం కల్పించాయి. అందువలనే రామ్‌నాథ్ కోవింద్ కమిటీ రాజ్యాంగంలో ఐదు ఆర్టికల్స్‌ను సవరణ చేయాలని ప్రతిపాదించింది. ఆ విధమైన సవరణలు చేస్తే ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నియంతృత్వాన్ని సమర్థించడమే అవుతుంది.

ప్రజల మనోభావాలు, ఆకాంక్షలు

ప్రస్తుతం భారతదేశంలో సామాజిక ఆకాంక్షలు, ప్రాంతీయ ఆకాంక్షలు పెరిగాయి. దీనివలన ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత పెరిగింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రజల మనోభావాలు ఒకరకంగా ఉంటే, శాసనసభల ఎన్నికలలో మరో విధంగా ఉండవచ్చు. లోక్‌సభ ఎన్నికలను సాధారణంగా జాతీయ ప్రాధాన్యత గల అంశాలు, శాసనసభల ఎన్నికలను రాష్ట్ర స్థాయిలో ఉండే అంశాలు ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు 2014 లోక్‌సభ ఎన్నికలలో ఢిల్లీలో ఏడు స్థానాలు బిజెపి గెలుపొందగా, కొద్ది నెలల తర్వాత జరిగిన శాసనసభల ఎన్నికలలో ఢిల్లీలోగల 70 శాసనసభ స్థానాలలో 67 స్థానాలను ఆప్ పార్టీ గెలుపొందింది. కర్ణాటకలో 1980లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాలు గెలుపొందగా, కొద్దినెలల తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికలలో రామకృష్ణ హెగ్డే నాయకత్వాన గల జనతాపార్టీ గెలుపొందింది. అందువలన జమిలి ఎన్నికలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా ఉండవని రాజకీయ నిపుణులు, న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

నరేంద్ర మోడీ ఆలోచనలు - రాజకీయ నియంతృత్వం

నరేంద్ర మోడీ ప్రభుత్వం 2014 మే లో పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చి, తిరిగి 2019లో గెలుపొందింది. గత పదేళ్లుగా నరేంద్ర మోడీ, అమిత్‌షా ద్వయం అనుసరిస్తున్న రాజకీయ విధానాలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాల కనుగుణంగా కొనసాగుతున్నాయి. కేంద్రస్థాయిలోను అన్ని రాష్ట్రాలలోను బిజెపి కానీ లేదా బిజెపికి అనుకూలమైన పార్టీలు ఉండాలనే ధోరణి బలంగా కనిపిస్తున్నది. అనేక చోట్ల ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకోవటం, చీల్చివేయటం జరుగుతున్నది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్ మొదలైన రాష్ట్రాలలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు దీనిని తెలుపుతున్నాయి.

గత పదేళ్లుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజలలో మతపరమైన విభజన తెచ్చే విధంగా, బిజెపి ఆధిపత్యాన్ని పెంచే విధంగా కొనసాగుతున్నాయి. జమ్మూ కాశ్మీర్ 370వ ఆర్టికల్ రద్దు చేయటం, పౌరసత్వ సవరణ చట్టం అమలు చేయటానికి నోటిఫికేషన్ జారీ చేయటం, మైనారిటీలపై దాడులు, రామాలయ నిర్మాణం...మొదలైనవన్నీ ప్రజల మధ్య మతపరమైన విభజన తెచ్చి బిజెపి రాజకీయ ఆధిపత్యాన్ని పెంచుకొనేందుకు చేసిన ప్రయత్నాలే. జమిలి ఎన్నికల ద్వారా తమ ఆధిపత్యాన్ని పెంచుకోవటానికి రాజకీయంగా కేంద్రంలోను అన్ని రాష్ట్రాలలోను తమ ప్రాబల్యం కొనసాగాలని భావిస్తున్నది.

జమిలి ఎన్నికలు - భావోద్వేగాలు

జమిలి ఎన్నికలు జరిపితే, ఎన్నికలు జరిగే సమయంలో ప్రజల భావోద్వేగాలను విదేశీ దాడుల పేరుతోనో, రామాలయం నిర్మాణం పేరుతోనో మతపరమైన ఉద్వేగాలను రెచ్చగొట్టో కేంద్రంలో అన్ని రాష్ట్రాలలో అధికారంలోకి రావచ్చని నరేంద్ర మోడీ, అమిత్ షా ద్వయం భావిస్తున్నది. మన దేశంలో అనేక సందర్భాలలో ప్రజలు భావోద్వేగాలకు గురికావటం గతంలో జరిగింది. ఉదాహరణకు గత ఎన్నికలకు ముందు పుల్వామా సంఘటన ద్వారా ప్రభుత్వం లాభపడింది. ప్రస్తుత ఎన్నికలలో నరేంద్ర మోడీ పర్యటనకు వెళ్లిన అనేకచోట్ల అభివృద్ధి గురించి కాకుండా రామాలయ నిర్మాణం గురించే ప్రస్తావన చేస్తున్నారు. భావోద్వేగాలను రెచ్చగొడితే ధరలు, నిరుద్యోగం, అవినీతి మొదలైన అంశాల చర్చ లేకుండా చేయవచ్చు. జమిలి ఎన్నికలు ప్రవేశపెట్టి భావోద్వేగాల ద్వారా ప్రజలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని వీరు భావిస్తున్నారు.

రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులను ఆధారం చేసుకుని, రాజ్యాంగ సవరణలు చేసి 2029 నాటికి ఆచరణలోకి తేవాలని నరేంద్ర మోడీ, అమిత్ షా ద్వయం పట్టుదలగా ఉన్నట్లు కనపడుతుంది. వీరి రాజకీయ, సామాజిక నియంతృత్వ విధానాలను అడ్డుకోవలసిన బాధ్యత ప్రజాస్వామ్య, లౌకిక శక్తులపై ఉన్నది. జమిలి ఎన్నికలలో జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా నష్టపోతాయి. లోక్‌సభ ఎన్నికలలో, శాసనసభల ఎన్నికలలో ప్రజలు వేరు వేరు అంశాలు ఆధారంగా ఓటు చేస్తారు. మందబలంతో రాజ్యాంగ సవరణలు చేసి బిజెపి ఈ విధానాన్ని దేశంపై రుద్దే అవకాశమున్నది. రాజ్యాంగ, సమాఖ్య స్ఫూర్తికి భిన్నమైన జమిలి ఎన్నికలను ప్రజాస్వామ్య వాదులందరూ వ్యతిరేకించాలి.

/ వ్యాసకర్త శాసనమండలి సభ్యులు, సెల్ : 8309965083 /

జనవాక్యం

ప్రభుత్వాలూ ప్రథమ పౌరులూ

తమిళనాడు గవర్నర్‌ని సుప్రీంకోర్టు నేరుగా మందలించడం తాజా పరిణామం. అవినీతి కేసులో హైకోర్టు తీర్పు ద్వారా శిక్ష పడిన నేపథ్యంలో తొలగించ బడ్డ మంత్రి పొన్ముడిని, ఆ తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించిన కారణంగా తిరిగి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించాలని కోరినప్పుడు గవర్నర్ తిరస్కరించారు. గవర్నర్ రాజ్యాంగ ధర్మం పాటించక పోవడం సుప్రీం ఆగ్రహానికి కారణమైంది. రాష్ట్రానికి ప్రథమ పౌరుడు గవర్నర్. చట్టాలు, పరిపాలన ఆయన పేరు మీదనే సాగుతాయి. ఆ లెక్కన ఆయన ప్రభువు. కానీ ప్రజాస్వామ్య విధానంలో ఆయన నామమాత్రపు ప్రభువు. ప్రజలే ప్రభువులు కనుక వారు ఎన్నుకున్న వారే కొలువు తీరుతారు. ఆ ప్రజలెన్నుకున్న ప్రభుత్వం అంటే ముఖ్యమంత్రి, మంత్రివర్గం సలహా సూచనల, సహాయం మేరకే గవర్నర్ పని చేస్తారు. రాజ్యాంగ సంక్షోభం లాంటి విపత్కర సమయాల్లోనే ఆయన పాత్ర కీలకమైందిగా మారుతుంది తప్పితే సాధారణ పాలనలో ప్రజా ప్రభుత్వంతో పైకి కనబడనంతగా మిళితమైపోతుంది. ప్రజల మాట పైచేయిగా ఉండాలన్న ఆకాంక్ష మేరకు రాజ్యాంగం ఏర్పరిచిన నియమం ఇది. విపక్ష ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో గవర్నర్ల పాత్ర తరచూ వివాదాస్పదంగా మారడం శోచనీయం. వారు రాజకీయ కోణాలకు అతీతంగా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తికి, సమాఖ్య స్ఫూర్తికి భంగం వాటిల్లదు.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం,

నివాళి

ఉరితాడే ఊయలగా...

డి. రాము

భారత జాతీయోద్యమంలో పాల్గొని కేవలం 23 ఏళ్ల వయసులో ఈ దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు భగత్ సింగ్. నేడు దేశాన్ని పాలిస్తున్న బిజెపి కానీ అది తొడుక్కున్న మతం ముసుగు ఆర్.ఎస్.ఎస్ గానీ జాతీయోద్యమంలో ఏనాడూ పాల్గొనలేదు. అటువంటి కుహనా దేశభక్తులు నేడు తామే అసలైన దేశభక్తులమని చెప్తుంటే హాస్యాస్పదంగా ఉంది. దేశభక్తి ముసుగులో ప్రజలందరికీ భ్రమలు కల్పిస్తూ నిరంతరం జాతీయవాదం పేరుతో యువతను, విద్యార్థులను పక్కదోవ పట్టిస్తున్నవారు దేశద్రోహులవుతారు కానీ దేశభక్తులెట్లా అవుతారు? దేశం కోసం, దేశ ప్రజల అభివృద్ధి కోసం పాటు పడే వాళ్లు అసలైన దేశభక్తులు. అటువంటి దేశభక్తులను దేశ ద్రోహులుగా చిత్రించి 'ఉపా' చట్టం పేరుతో సంవత్సరాల తరబడి జైల్లో మగ్గేలా చేయడమేనా దేశభక్తి అంటే? గాంధీని చంపిన గాడ్సే కాదు దేశభక్తుడు. నేను జైల్లో ఉండేకంటే బయట ఉంటేనే హిందూ ముస్లింల మధ్య ఘర్షణలు పెట్టి వారి మధ్య ఐక్యతను చీల్చుతానని చెప్పి క్షమాభిక్ష పత్రం పెట్టుకుని బ్రిటీష్ వారి అడుగులకు మడుగులొత్తిన సావర్కర్ కాదు దేశభక్తుడు. క్షమించమని ఒక్క మాట అంటే చాలు నిన్ను విడిచిపెట్టేస్తామని అన్నారని తన తండ్రి చెబితే దానికంటే చావడం నయమని చెప్పి దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నిజమైన దేశభక్తులు. అటువంటి దేశభక్తుల జీవితాల గురించి తెలుసుకుని వారి స్ఫూర్తితో...నేటి యువత, విద్యార్థులు పోరాటాల్లోకి చేరుతూ బిజెపి పాలకుల నిగ్గు తేలుస్తున్నారనే భయంతో...వారి జీవిత చరిత్రలను పాఠ్యాంశాల నుండి తొలగించింది కర్ణాటక బిజెపి ప్రభుత్వం. నిజమైన దేశభక్తులను పుస్తకాల్లో కనిపించకుండా చేస్తూ దేశ స్వాతంత్రోద్యమంలో ఏ మాత్రం పాత్ర లేని ఆర్.ఎస్.ఎస్ నాయకులను, జాతీయ నాయకులను చంపిన దేశద్రోహులను దేశభక్తులుగా ప్రచారం చేస్తున్నది బిజెపి. బ్రిటిష్ దాస్య శృంఖలాల నుండి భారత దేశాన్ని విముక్తి చేయడం కోసం తన ప్రాణాలనే తృణప్రాయంగా అతి చిన్న వయసులోనే భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు ఉరికంబమెక్కిన రోజు నేడు.

భగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న బంగా గ్రామంలో జన్మించాడు. జాతీయోద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చిన జలియన్ వాలాబాగ్ ప్రాంతాన్ని తన పన్నెండేళ్ళ వయస్సులో సందర్శించాడు. ఇక్కడ జరిగిన పోలీసు దమనకాండలో అధికారిక లెక్కల ప్రకారం 379 మంది మరణానికి, 1200 మందికి పైగా క్షతగాత్రులవడానికి కారణమైన బ్రిటీష్ వారిని ఎలాగైనా ఈ దేశం నుండి తరిమికొట్టాలని బలంగా ఆనాడే అనుకున్నాడు. 1928లో సైమన్ గోబ్యాక్ ఉద్యమంలో లాలా లజపతిరాయ్‌పై లాఠీ ఝుళిపించి ఆయన గుండెపోటుతో మరణించడానికి కారణమైన పోలీసు అధికారిని చంపాలనుకున్నాడు. అందుకు ప్రయత్నించినప్పటికీ...ఆ తరువాత వ్యక్తిగత హత్యలతో స్వాతంత్ర్యం సాధించలేమని ప్రజలను కూడగట్టి రాజ్యాధికారాన్ని కూలదోస్తేనే స్వాతంత్ర్యం వస్తుందని గ్రహించాడు. అందుకుగాను నిజమైన విప్లవ శక్తులు ఎవరనే దానికోసం శోధించాడు. లెనిన్, మార్క్స్ రచనలను, మార్క్సిస్టు సాహిత్యాన్ని చదువుతూ రష్యా విప్లవాన్ని, ఫ్రెంచ్ విప్లవాన్ని అధ్యయనం చేస్తూ అతి చిన్న వయస్సులోనే పెట్టుబడిదారీ సమాజాన్ని దాని దోపిడీ పద్ధతులను పూర్తిగా తెలుసుకున్నాడు. వ్యవసాయ పొలాల్లో ఉన్న రైతులు, కర్మాగారాల్లో ఉన్న కార్మికులే అసలైన విప్లవ శక్తులని వారి దగ్గరకు మనం చేరుకోవాలని తన అనుచరులకు ఆదేశించాడు. ఆ రకంగా కార్మికులను, రైతులను చైతన్యం చేసి వారిని ఐక్యం చేసి పోరాటాల్లోకి దించాడు. ప్రజలను చైతన్యం చేయడం కోసం 1926లో సుఖదేవ్, భగవతీ చరణ్, యశ్పాల్ తదితరులతో కలిసి 'నవ జవాన్ భారత్'ను స్థాపించాడు. దీనితో బహిరంగ సభలు, కరపత్రాలు, ప్రకటనల ద్వారా వారి అభిప్రాయాలను ప్రచారం చేశారు. దీనితో పాటు అవకాశం దొరికినప్పుడల్లా జైళ్లు, కోర్టులను సైతం ప్రచార సాధనాలుగా ఉపయోగించుకుని నిరంతరం ప్రజలను చైతన్యపరుచుకుంటూ వచ్చాడు. జైలు లోపల ఉన్నప్పుడు కూడా రాజకీయ ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, చదువుకోవడానికి పుస్తకాలు, న్యూస్‌పేపర్లు అందించాలని 64 రోజులు పాటు నిరాహార దీక్షలు చేశాడు. పోలీసులు, డాక్టర్లు ఈ దీక్షలకు భంగం కలిగించాలని ప్రయత్నిస్తే వారికి ముచ్చెమటలు పట్టించి బ్రిటీష్ పాలకులకు సింహస్వప్నంలా నిలిచాడు. చివరికి భారత పాలకులు బ్రిటీష్ వారితో కలిసిపోయి ప్రజలకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తున్న సందర్భంలో ఈ నల్ల చట్టాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని దానికి ఉన్న ఏకైక మార్గం పార్లమెంటు సమావేశాలే అనుకున్నాడు. కచ్చితంగా అలా చేస్తే ఉరిశిక్ష పడుతుందని తెలిసినా పార్లమెంటులో పొగబాంబు వేసి అనుకున్న విధంగానే పోలీసులకు పట్టుబడి చట్టాలను ప్రజలకు వివరించాలన్న లక్ష్య సాధనలో... దేశం కోసం 1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు ముగ్గురూ ఉరితీయబడ్డారు. ఉరితాళ్లనే ఉయ్యాలలుగా భావించి 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ నినదిస్తూ చావును సైతం చిరునవ్వుతో స్వాగతించి అమరులైన వారి త్యాగం మరువలేనిది. ఉరి సమయంలో 'బతికున్న భగత్‌సింగ్ కంటే మరణించిన భగత్‌సింగే మీకు అత్యంత ప్రమాదకారి. మీరు నన్ను చంపగలరు కానీ నా ఆలోచనలను కాద'ని బ్రిటీష్ పాలకులకు సింహస్వప్నంగా నిలిచిన భగత్ సింగ్ గొప్ప పోరాట యోధుడు మాత్రమే కాదు, గొప్ప అధ్యయనశీలి కూడా.

మరికొద్ది క్షణాల్లో ఉరితీస్తారని తెలిసినా చివరి సమయం వరకు లెనిన్ రాసిన 'ఏం చెయ్యాలి?' అనే పుస్తకం చదువుతూ కొద్ది పేజీలు మిగిలి ఉన్నాయని అవి పూర్తి చేసిన తరువాత ఉరితీయమని పోలీసు అధికారులను కోరాడు. చనిపోయే ముందు వరకు భగత్‌సింగ్ భారత దేశ స్వాతంత్ర్యం కోసం అధ్యయనం చేస్తూనే ఉన్నాడు. అందుకే భగత్ సింగ్ చేతిలో పుస్తకం లేకుండా నేను ఏనాడూ చూడలేదని శివవర్మ అంటాడు. భగత్ సింగ్‌కి దేవుని పట్ల, మతం పట్ల కొన్ని భిన్నాభిప్రాయాలున్నాయి. నేనెందుకు నాస్తికుడిని అయ్యానని రాసుకున్న తన రచన చదివితే దేవునిపైన, మతం పైన అతని వైఖరి ఏంటనేది మనకు పూర్తిగా అర్థమౌతుంది. అదేవిధంగా విప్లవం ఎందుకు అవసరం అన్న రచనలో విప్లవానికి కావలసింది ఉద్రేకం, చావటం కాదు. నిరంతర పోరాటం కావాలి. బాధలను భరించాలి. త్యాగం కావాలి. ముందు నీ అహంభావాన్ని తొలగించు. వ్యక్తిగత సౌఖ్యానికి సంబంధించిన కలలను తుడిచెయ్యి. అప్పుడు పని ప్రారంభించు. ఇందుకు ధైర్యం, సంరక్షణ, అకుంఠిత దీక్ష అవసరం. ఎటువంటి కష్టాలు, అడ్డంకులూ నిన్ను నిరుత్సాహపరచవు. ఏ వైఫల్యమూ విచ్ఛిన్నతలూ నిన్ను అధైర్యపరచవు. బాధల అగ్నిపరీక్షలను తట్టుకొని త్యాగాల ద్వారా నీవు విజయునిగా బైటకి వస్తావు. ఈ వ్యక్తిగత విజయాలే విప్లవానికి విలువైన ఆస్తులౌతాయంటూ తరువాత తరాలవారి హృదయాల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించాడు. ఈ స్ఫూర్తితో యువతరం, విద్యార్థులు చైతన్యవంతులై భగత్‌సింగ్ ఆశయ సాధనకై ఉద్యమించాలి.

నేడు భగత్‌సింగ్ వర్ధంతి

(వ్యాసకర్త ఎస్.ఎఫ్.ఐ విజయనగరం జిల్లా సహాయ కార్యదర్శి, సెల్ : 9705545164)

కవిత్వం

నీరే ఆధారం!

ఎర్రటి ఎండల్లో నెర్రెలు బారిన
నేలల్లో వలసల్లా సాగుతోన్న దాహం!
నెత్తిన ఖాళీ బిందెలతో దూరాలు
తగ్గించేసినా చెమటల్లో తప్ప నీటిని
నిజంగా చూడలేని నిస్సహాయత
ఒక్క చెలమ చెలిమి లేని ఒంటరి
ఇసుక దారుల్లో కన్నీటి పొరల్లోంచే
కానరాని నీటిజాడ కోసం అన్వేషణ!
చేతులు కాలాక ఆకులు పట్టినట్టు..
అమృత ధారల్లాంటి వర్షపు నీళ్ళు
నేలపాలైన గాజు ప్రతిమలా వెక్కిరిస్తుంటే
ఆ ముత్యపు బిందువుల్ని గుదిగుచ్చి
భద్రంగా దాచుకోలేని నిర్లక్ష్య ఫలమిది
నదుల ఊపిరి తీసేలా ప్రవాహదారుల్ని
కాచి రిసార్టుల్ని గుండెలపై అదిమేసి
నదీమ తల్లిని ఎముకల గూడు చేసి
అడవుల్లో ఆటవిక రాజ్యం స్థాపించి
పచ్చదనాన్ని నల్లధనంగా మార్చేసి
నేలతల్లి గుండెల్లోకి ఎండిన బోర్లేసి
భూగర్భ జలాలకు గర్భశోకం తెచ్చిపెట్టి
అవినీతి సంపాదనకే పథకాలు తప్ప
సాగునీటికి తాగునీటికి ప్రణాళికలు
లేని దూరదృష్టి రాహిత్యపు దురదృష్టాల్ని
వెంటేసుకొని ఎండిన బావుల చుట్టూ
ఆవురావురాని మూగే కాకులమయ్యేం!
ఖాళీ బిందెలు బీళ్లు పడిన నేలలు
ఎండిన గొంతుకలతో పాడిపంటలు కరువై
ఎడారి కష్టాలై తడారిన బతుకులయ్యాయి
పరిసరాలు ఎండి గుండె తడి ఆవిరయ్యేక
ఇకనైనా మనం కళ్ళు తెరవాలి తప్పదు!
ప్రతి నీటి బిందువు సాక్షాత్తూ అమృత
బిందువేనని గుర్తించి నీటిని పూజించాలి.

- భీమవరపు పురుషోత్తమ్
సెల్ : 9949800253

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

స్టార్టప్‌లకు నిధుల కటకట



- ఫండింగ్‌కు విదేశీ సంస్థల విముఖత
- తగ్గించుకుంటున్న పెట్టుబడులు
- నిరుత్సాహంలో ఔత్సాహికవేత్తలు

న్యూఢిల్లీ : భారత్‌లోని స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. నిధుల సమీకరణలో తీవ్ర సవాళ్లను చవి చూస్తున్నాయి. గతేడాది నిధుల లభ్యత భారీగా తగ్గిపోయింది. భారత ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని మోడి ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి.. స్టార్టప్‌ల్లో పెట్టుబడులకు భిన్నమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు భారతీయ టెక్ వెంచర్లలో వందల కోట్ల డాలర్ల పెట్టుబడికి ఆసక్తిని చూపిన ఇన్వెస్టర్లు ఇటీవల నెమ్మదించారు. దీంతో నిధుల కొరతతో ఔత్సాహిక వ్యాపారవేత్తలు నిరాశ చెందు తున్నారు. ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియంలో చోటు చేసుకున్న పరిణామాలు ఇన్వెస్టరల్లో మరింత విశ్వాసాన్ని దెబ్బతీశాయి. వందలాది ప్రారంభ దశ స్టార్టప్‌ల్లో పెట్టుబడులు పెట్టిన ఇండియాస్ బ్లూమ్ వెంచర్స్ మేనేజింగ్ పార్టనర్ కార్తిక్ రెడ్డి గతేడాదిలో 12 డీల్‌లతో పోలిస్తే ఈ ఏడాది దాదాపు ఎనిమిది మాత్రమే కొత్త ఒప్పందాలు చేయాలని తమ సంస్థ యోచిస్తోందని చెప్పారు. ఇది మరిన్ని కంపెనీ లలో నిధులను విస్తరించడానికి బదులుగా తనకు నమ్మకంగా ఉన్న సంస్థలలో పెద్ద మొత్తాలను పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నామన్నారు. ప్రస్తుతం పోర్టుపోలియో లాభాలను పరిశీలించినప్పుడు మరింత ఇన్వెస్ట్ చేయడానికి ఉత్సాహంగా లేమని రాయిటర్స్‌తో ఆయన అన్నారు.

రాయిటర్స్ ఇటీవల విదేశీ, స్వదేశీ పెట్టుబడి సంస్థల్లోని ఆరుగురు ఎగ్జిక్యూటివ్‌లు, ఇద్దరు సిఇఒలను ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుత ఏడాది జనవరి, ఫిబ్రవరిలో భారత స్టార్టప్‌లు 900 మిలియన్ డాలర్ల (రూ.7500 కోట్లు)ను సేకరించాయి. ఇది ఆరేళ్ల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. కాగా 2023లో 8 బిలియన్ల (రూ.64వేల కోట్లు) నిధులు సమీకరించాయని వెంచర్ ఇంటెలిజెన్స్ డేటా చూపిస్తోంది. ఇది 2021లో సేకరించిన రికార్డు 36 బిలియన్లు లేదా 2022లో 24 బిలియన్లకు చాలా దూరంగా ఉంది. గతేడాది భారతీయ స్టార్టప్‌లకు మూడింట రెండు వంతుల నిధులు తగ్గాయని సిబిఐఇన్‌సైట్స్ డేటా వెల్లడించింది. అమెరికాలోని స్టార్టప్‌లకు 36 శాతం తగ్గుదలతో పోల్చితే భారత స్టార్టప్‌లు చాలా వెనుకబడి పోయాయి. ప్రస్తుత వాతావరణంలో స్టార్టప్‌ల్లో పెట్టుబడుల ద్వారా పెద్ద రాబడిని పొందగలమని తాను భావించడం లేదని కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు.

పేటియం షేర్లు 80 శాతం మేర పడిపోవడం, ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ విలువ 22 బిలియన్ల నుంచి 2 బిలియన్ల దిగువకు పడిపోవడం భారత స్టార్టప్‌లపై సానుకూలాంశాలను దెబ్బతీశాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ రంగంలో ఫండింగ్ తగ్గిపోవడంతో పాటు భారీగా ఉద్యోగాలు ఊడుతోన్న విషయం తెలిసిందే. స్టార్టప్‌లకు నిధుల మద్దతులో బిజెపి ప్రభుత్వం సరైన విధానాన్ని అనుసరించకపోవడం, బడా కార్పొరేట్లకు కొమ్ము కాయడం వల్లే అవి ఒత్తిడిలోకి జారుకుంటున్నా యనే విమర్శలు పెరుగుతున్నాయి.

'డిస్‌ప్యూట్' మాయాజాలం

- కార్పొరేట్లకు అనుకూలంగా నిబంధనల మార్పులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల వేళ వివాదాస్పద భూముల విషయంలో కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సిసిఎల్‌ఎ నుండి జిల్లాల కలెక్టర్లకు జారీ అయిన తాజా ఆదేశాల్లో డిస్‌ప్యూట్ రిజిస్టర్‌లో భూముల నమోదుకు సంబంధించి కీలక మార్పులు చేశారు. ఇప్పటిదాకా భూ వివాదాలకు సంబంధించి ఎవరైనా కోర్టులో వ్యాజ్యం దాఖలు చేయగానే ఆ భూమిని డిస్‌ప్యూట్ రిజిస్టర్‌లో నమోదు చేసేవారు. దీంతో వివాదం పరిష్కారమయ్యేంత వరకు ఆ భూమిని ఇతరులెవ్వరు విక్రయించడానికి గానీ, కొనుగోలు చేయడానికి అవకాశం ఉండేది కాదు. దీంతో వాస్తవ యజమానికి కొంత మేర రక్షణ లభించేది. తాజాగా ఈ నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. ఆ భూమిపై వివాదం ఉందన్న విషయాన్ని కోర్టు అధికారికంగా చెప్పిన తరువాతనే రిజిస్టర్‌లో నమోదు చేయాలని తాజా నిబంధనల్లో పేర్కొన్నారు. అంటే ఎవరైనా కోర్టును ఆశ్రయించినంతమాత్రన ఆ భూమిని ఇక నుండి డిస్‌ప్యూట్ రిజిస్టర్‌లో నమోదు చేయరు. కోర్టు అధికారికంగా వివిదాస్పద భూమిగా గుర్తించేంతవరకూ దానిపై లావాదేవిలకు అవకాశం ఉంది. ఇది సామాన్యులకు శాపంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే విధంగా టైటిల్ సూట్ కోసం కోర్టు స్టాంప్ ఫీజు పూర్తిగా చెల్లించి, తహసీల్ధార్‌ను పార్టీ చేస్తూ సివిల్ కోర్టులో కేసు ఉన్న సందర్భంలో కోర్టు ఆదేశాలు లేకపోయినా డిస్‌ప్యూట్ రిజిస్టర్‌లో నమోదుచేయవచ్చని పేర్కొన్నారు ఆర్‌ఓఆర్/జాయింట్ కలెక్టర్ వద్ద అప్పీల్స్, విచారణలో ఉన్న భూములను ఎట్టిపరిస్థితుల్లోనూ డిస్‌ప్యూట్ పుస్తకంలో నమోదు చేయవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎపి అసైన్డ్ ల్యాండ్స్ (పిఓటి) యాక్ట్ 9/77కి సంబందించిన అప్పీల్స్, రివ్యూస్, రివిజన్‌లు జాయింట్ కలెక్టర్/కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఆయా భూములను తహసీల్దార్లు సంతృప్తి చెందితే రికార్డులనుంచి తొలగించవచ్చని పేర్కొంది.

ఫారం నం. యుఆర్‌సి-2

చట్టం యొక్క చాప్టర్ 21 యొక్క పార్ట్-1 క్రింద రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నోటీసు ఇచ్చు ప్రకటన.
(కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 374(బి) మరియు కంపెనీల (అథొరైజ్డ్ టు రిజిస్టర్) రూల్స్, 2014 అనుసరించి)

1. ఇందుమూలంగా కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 366 యొక్క సబ్-సెక్షన్ (2) అనుసరించి ప్రకటన ఇవ్వడమేమనగా, కంపెనీల రిజిస్ట్రార్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్, 29-7-33, మొదటి అంతస్తు, విష్ణువర్ధనరావు స్ట్రీట్, సూర్యారావుపేట్, విజయవాడ-520002, ఆం.ప్ర. లేదా సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసిఎ), ప్లాట్ నం.6,7,8, సెక్టార్-5, ఐఎంటి మనెసర్, గుర్గాం-122050 (హర్యానా) వద్ద రిజిస్ట్రార్ అనువారు, వాటాల ద్వారా కంపెనీ లిమిటెడ్‌గా , కంపెనీల చట్టం 2013 యొక్క చాప్టర్ 21 యొక్క పార్ట్ 1 క్రింద "శ్రీ సాయినాథ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్" పార్టనర్‌షిప్ సంస్థగా దరఖాస్తుచేయవలసిందిగా ప్రతిపాదిస్తున్నారు.
2. కంపెనీ యొక్క ప్రధాన అంశాలు దిగువ విధంగా: సమయానుసారం పార్టనర్స్ ల మధ్య కుదిరిన ఒప్పందంగా నిర్మాణాల వ్యాపారం మరియు సంబంధిత వ్యాపారంను చేపట్టుటకు.
3. ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమోరండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ కాపీని, కంపెనీల రిజిస్ట్రార్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్, 29-7-33, మొదటి అంతస్తు, విష్ణువర్ధనరావు స్ట్రీట్, సూర్యారావుపేట్, విజయవాడ-520002, ఆం.ప్ర. లేదా సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసిఎ), ప్లాట్ నం.6,7,8, సెక్టార్-5, ఐఎంటి మనెసర్, గుర్గాం-122050 (హర్యానా)వద్ద గల కార్యాలయం వద్ద పరిశీలించవచ్చును.
4. ఈ దరఖాస్తు పట్ల ఎవరికైనా ఏవేని అభ్యంతరాలు ఉన్న ఎవరైనా వ్యక్తి, దానిని పై పేర్కొన్న కంపెనీకి దాని రిజిష్టర్డు ఆఫీసు కంపెనీల రిజిస్ట్రార్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్, 29-7-33, మొదటి అంతస్తు, విష్ణువర్ధనరావు స్ట్రీట్, సూర్యారావుపేట్, విజయవాడ-520002, ఆం.ప్ర. కు ఒక కాపితో, ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఇరువై ఒక రోజుల్లోగా, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసిఎ), ప్లాట్ నం.6,7,8, సెక్టార్-5, ఐఎంటి మనెసర్, గుర్గాం-122050 (హర్యానా) వద్ద రిజిస్ట్రార్‌కు వ్రాతపూర్వకంగా వారి అభ్యంతరాలను తెలుపవచ్చును.

దరఖాస్తుదారుల పేర్లు
1. మేదరమెట్ల రవీంద్ర బాబు,
2. మేదరమెట్ల ఈశ్వరమ్మ
3. మేదరమెట్ల శ్రీనివాసులు

తేది : 23.03.2024

అనంతపురంలో దారుణం

- శుభకార్యమని వృద్ధురాలి నగలు తీసుకొని తాకట్టు
- ఒత్తిడి చేయడంతో హత్య
- శరీరాన్ని ముక్కలు చేసి నదిలో పడేసిన కిరాతకులు

ప్రజాశక్తి-గార్లదిన్నె (అనంతపురం)

అనంతపురం జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు తీసుకున్న బంగారు నగలను తిరిగి ఇవ్వాలని కోరిన వృద్ధురాలిని అత్యంత దారుణంగా హతమార్చారు. శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చేసి పెన్నా నదిలో పడేశారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలో శుక్రవారం వెలుగుచూసిన ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం డిఎస్‌పి వెంకటశివారెడ్డి గురువారం వెల్లడించారు. ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఓబుళమ్మ (85) భర్త మరణించిన తర్వాత తన తమ్ముడి శివశంకర్‌రెడ్డి వద్ద ఉంటున్నారు. వీరి పొలం పక్కనే ఉన్న పొలాన్ని బీరే కృష్ణమూర్తి కౌలుకు తీసుకున్నాడు. ఈ క్రమంలో గత నెల ఏడున ఓ శుభకార్యానికి వెళ్లాలని ఓబుళమ్మ వద్ద ఉన్న ఏడు తులాల బంగారు నగలను కృష్ణమూర్తి తీసుకున్నాడు. ఈ నగలను రూ.2.80 లక్షలకు బ్యాంకులో తాకట్టుపెట్టాడు. నగలు ఇవ్వాలని ఓబుళమ్మ ఒత్తిడి చేయడంతో ఆమెను హతమార్చాలని పథకం పన్నాడు. ఈ విషయంలో కుటుంబ సభ్యుల సహాయం తీసుకున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 21న ఓబుళమ్మను తాను కౌలు చేస్తున్న పొలం వద్దకు కృష్ణమూర్తి తీసుకెళ్లాడు. అక్కడ కుమారులతో కలిసి ఓబుళమ్మను దారుణంగా హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా చేసి ఓ గోనె సంచిలో వేసి పామిడి మండలం కోనేపల్లి దగ్గర పెన్నా నదిలో పారవేశాడు. ఓబుళమ్మ కనబడకపోవడంతో ఆమె మేనకోడలు శివలక్ష్మి గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఓబుళమ్మను కృష్ణమూర్తి తన ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడని ఆమె తమ్ముడు శివశంకర్‌రెడ్డి పోలీసులకు చెప్పారు. కృష్ణమూర్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తానే హత్యచేశానని కృష్ణమూర్తి ఒప్పుకోవడంతో అతనితోపాటు ఇద్దరు కుమారులు, భార్యపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

కార్పొరేట్ కార్యాలయం: 167-169, 2వ అంతస్తు, అన్నా సలై, సైదాపేట్, చెన్నై-600015, మరియు దాని బ్రాంచ్‌లలో ఒకటైన హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 54-20-10/1ఏ, ప్లాట్ నెం: 43, 3వ అంతస్తు, ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా, మెయిన్ రోడ్, గురునానక్ కాలనీ, విజయవాడ-520 008.
www.hindujahousingfinanace.com

అనుబంధం-4 **స్వాధీనతా ప్రకటన** **(స్థిరాస్తి కొరకు)**

ఏదైతే, క్రింది సంతకందారుడు హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (చట్టం నెం.54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులు ముగిసిన తరువాత దిగువ పేర్కొన్న రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి. రుణగ్రహీత మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీత(ల)/ హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదవగల చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద వారికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **భౌతికంగా స్వాధీనంలోకి** తీసుకోవడమైనది.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారుల పేరు/లాన్	బాకీపడిన మొత్తం బకాయిలు	డిమాండ్ నోటీసు తేది	భౌతిక స్వాధీనతా తేది
1	1) శ్రీ తిరుపతి నీలం రాజు, తండ్రి తిరుపతి లక్ష్మయ్య, రుణగ్రహీత 2) శ్రీమతి తిరుపతి శివకుమారి, భర్త తిరుపతి నీలంరాజు, సహ- రుణగ్రహీత, నివాసం: డోర్‌నెం.62/2ఏ/ఏ, బ్లాక్ నెం.10, నారాయణ పురం, నడికుడి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, దాచేపల్లె మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522414. LAN NO:AP/VWD/BENZ/A000000410	07.10.2021 నాటికి రూ.16,01,057/- (రూపాయలు పదహారు లక్షల ఒకవెయ్యి యాభైఏడు మాత్రమే)	12-10-2021	19 మార్చ్, 2024 1100గం.లు-1400గం.లు
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి): నారాయణపురం, నడికుడి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, దాచేపల్లె మండలం, గుంటూరు జిల్లాలోని బ్లాక్ నెం.10, డోర్ నెం.62/2ఏ/ఏ వద్దగల ఆస్తి మొత్తం, గుంటూరు జిల్లా ఎస్ఆర్ఓ గురజాల పరిధిలోని ఆస్తి యొక్క 232.01చ.గ.లు లేదా 194.89చ.మీ.ల విస్తీర్ణంలో ఉంది. సరిహద్దులు: తూర్పు:4 అ.ల వెడల్పుగల గల్లీ బజార్, పడమర: బజార్, ఉత్తరం: టి.నీలం రాజుకు గోలి రాజారావు విక్రయించిన 173 అ.లు, దక్షిణం: టి నీలం రాజు ఆస్తి.			

ప్రధానంగా రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలను జరపదలచిన వారు హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్ వారికి దిగువ పేర్కొన్న డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై తదుపరి వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది.

సం/- అధీకృత అధికారి,
హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

ప్రదేశం: విజయవాడ, తేది: 22 మార్చ్, 2024

భౌతిక స్వాధీనత నోటీసు

ICICI Bank | **శాఖ కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

ఏదైతే
దిగువసంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/భౌతిక స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	శబరీష్ ఏజెన్సీస్, కొసరాజు వీర నాగమురళీ, కొసరాజు సుధ, కొసరాజు సుజాత/ఫ్లాట్ నం.202, భాగ్యరేఖ రెసిడెన్సీ ఇబ్రహీంపట్నం పశ్చిమ గోదావరి విజయవాడ-521456/ 362605000508/ 362655000001.	ఆస్తి 1 : ఆంధ్రప్రదేశ్-521456, పశ్చిమ గోదావరి, విజయవాడ, విజయవాడ ఇబ్రహీంపట్నం భాగ్యరేఖ రెసిడెన్సీ ఫ్లాట్ నం.202. తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై. ఆస్తి 2 : ఆంధ్రప్రదేశ్-521456, పశ్చిమ గోదావరి, విజయవాడ, విజయవాడ, ఇబ్రహీంపట్నం, భాగ్యరేఖ రెసిడెన్సీ, ఫ్లాట్ నం.103. తూర్పు : కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై. ఆస్తి 3 : ఆంధ్రప్రదేశ్-521137, కృష్ణ విజయవాడ పోరంకి పోస్టాఫీసు రోడ్డు, నం.3-203. తూర్పు : ఉమ్మడి బజార్, దక్షిణం : సోమల బాల నాగమ్మ ఆస్తి, పడమర : మతలాకు ఆస్తి, ఉత్తరం : వెనుగళ్ల కోటి రామ మూర్తి ఆస్తి. పై మొత్తం ఆస్తి తో కలిపి అన్నీ భవనములు మరియు నిర్మాణాలు అందులో ఫిక్చర్స్, ఫిట్టింగ్స్ మరియు అన్నీ ప్లాంట్ మరియు యంత్రాలు భూమికి జోడించబడి ఉంటాయి లేదా భూమికి జోడించబడిన దేనికైనా వర్తమానం మరియు భవిష్యత్తు రెండూ శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి. భౌతిక స్వాధీనతా తేది : 19 మార్చి 2024	13-07-2023 Rs. 2,73,21,314.00/-	ఆంధ్రప్రదేశ్

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది: 22 మార్చి, 2024
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

కవితకు బెయిల్ నిరాకరించిన సుప్రీం

- ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఇడి) కస్టడీలో ఉన్న కవితకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. కవిత దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌ను నిరాకరించింది. బెయిల్ కోసం ట్రయల్ కోర్టును వెళ్లాలని స్పష్టం చేసింది. ఇడి కస్టడీని సవాల్ చేస్తు కవిత సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ ను శుక్రవారం సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ఎంఎం సుందరేశ్ లో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. కవిత తరపు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, విక్రమ్ చౌదరీలు వాదించారు. హైకోర్టుకు వెళ్లాలని మాత్రం సూచించొద్దని ధర్మాసనాన్ని కోరారు. కవితకు వ్యతిరేకంగా ఒక్క చిన్న ఎవిడెన్స్ కూడా దర్యాప్తు సంస్థల దగ్గర లేదని అన్నారు. మాగుంట రాఘవ్ ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా ఆమెను నిందితురాలిగా పేర్కొంటున్నట్లు వివరించారు. దీనిపై స్పందించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఉద్వేగానికి గురి కావొద్దని సూచించారు. బెయిల్ విషయంలో ట్రయల్ కోర్టుకు వెళ్లాలని స్పష్టం చేశారు. అయితే కవిత పిటిషన్ లో లేవనెత్తిన రాజ్యాంగపరమైన అంశాలను పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం ఇడికి నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లో కవిత పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేయాలని ఇడిని ఆదేశించింది. ఇడి సమాధానంపై రిజాయిండర్ దాఖలు చేసేందుకు పిటిషనర్ కు మరో ఆరు వారాల సమయం ఇచ్చింది.

ఫ్యూజిఫిల్మ్ నుంచి అత్యాధునిక ఓపెన్ ఎంఆర్ఐ యంత్రం

- విజయ డయాగ్నస్టిక్స్‌లో ఏర్పాటు

- కేంద్ర ఏజెన్సీలతో ప్రతిపక్షాలపై దాడులు
- రాజకీయంగా గుప్పెట్లో పెట్టుకునే యత్నాలు
- లోక్‌సభ ఎన్నికల ముందు బిజెపి వ్యూహాలు
- కేజ్రీవాల్, హేమంత్ సోరేన్ అరెస్టులు అందులో భాగమే
- 'ఇండియా' కూటమిని బలహీనపర్చే యత్నం

న్యూఢిల్లీ : భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీలు దగ్గరపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం ఎలాగైనా మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నది. 400కు పైగా లోక్‌సభ సీట్లను గెలవటమే లక్ష్యంగా పెట్టుకున్నది. సిద్ధాంత పార్టీగా గొప్పలు చెప్పుకునే ఆ పార్టీ.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ఇతర పార్టీల నుంచి నాయకులను తీసుకొచ్చి టికెట్లు ఇస్తున్నది. సొంత పార్టీ నాయకులనే చిన్న చూపు చూస్తున్నది.

ఇక కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి తన రాజకీయ లబ్ది కోసం ప్రత్యర్థులపై ఆయుధంగా వాడుకుంటున్నది. సిబిఐ, ఇడి, ఐటి సంస్థలను ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఉసిగొల్పుతూ, వారిపై కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపేలా వ్యూహాలు పన్నుతున్నది. నాయకులను బెదిరించి పార్టీల్లో చీలికలు తేవటం, ప్రభుత్వాలు కూల్చటం, నాయకులను తమ పార్టీలోకి చేర్చుకోవటం వంటి చర్యలను కొనసాగిస్తున్నది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు ఇందులో భాగమేనని విశ్లేషకులు చెప్తున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్, ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తెలంగాణ ఎమ్మెల్సీ కవితలు ఈ కేసులో అరెస్టైన విషయం విదితమే. ఇప్పుడు ఈ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేజ్రీవాల్, కవితల అరెస్టులతో ఢిల్లీ, తెలంగాణల్లోనే కాకుండా యావత్ దేశంలో రాజకీయంగా ప్రయోజనం పొందొచ్చనీ, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇది ప్రచారాస్త్రంగా మలుచుకోవచ్చని బిజెపి భావించింది. అయితే, ఈ అంశం కాషాయపార్టీకి రివర్స్‌ఫైర్ అయ్యే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ప్రతిపక్షం బలంగా లేకపోవటంతో..

భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్షం అత్యంత కీలకమైనది. గత రెండు దఫాల ఎన్డీయే పాలనలో ప్రధాన ప్రతిపక్షం బలంగా లేదు. ప్రతిపక్ష స్థానానికి కావాల్సిన సీట్లను సైతం కాంగ్రెస్ గెలవలేకపోయింది. ఇక లోక్‌సభలో తమకు ఉన్న బలం చూసుకొని బిజెపి రెచ్చిపోయిందనీ, అనేక ప్రజా వ్యతిరేక, మత విద్వేష బిల్లులను తీసుకొచ్చి చట్టాలుగా మార్చిందని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

టార్గెట్ 'ఇండియా' కూటమి

రాబోయే ఎన్నికల్లో బిజెపి ఓటమే లక్ష్యంగా 'ఇండియా' కూటమి ఏర్పడింది. కాంగ్రెస్, ఆప్, డిఎంకె, సిపిఎం, సిపిఐ, జెడియు, జెఎంఎం, ఎన్‌సిపిలు అందులో కీలకంగా ఉన్నాయి. అయితే, బీహార్‌లో జెడియును దూరం చేసి.. నితీశ్‌కి మద్దతు పలికిన బిజెపి అక్కడ సంకీర్ణ ప్రభుత్వానికి బీజం వేసింది. ఇటు మహారాష్ట్రలోని కీలక ఎన్‌సిపి పార్టీలో కాషాయపార్టీ చీలిక తెచ్చింది. జార్ఖండ్ సిఎం, జెఎంఎం నాయకుడు హేమంత్ సొరెన్‌ను ఇదే ఇడి అరెస్ట్ చేసింది. ఇక ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఆప్‌పై కన్నేసిన బిజెపి.. ఇడి సహాయంతో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయించగలిగింది. అయితే, కేజ్రీవాల్ అరెస్ట్‌పై దేశ ప్రజల నుంచి బిజెపి ఆశించిన స్పందన రాకపోగా.. బిజెపి వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తిని తెప్పిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఎలక్టోరల్ బాండ్ల నుంచి దృష్టి మరల్చేందుకే..

బిజెపికి విరాళాలిచ్చిన 487 మందిలో మొదటి 10 మంది విరాళాలు దాదాపు రూ. 2,119 కోట్లుగా ఉన్నాయి. బాండ్ కొనుగోళ్లలో ఎక్కువ వాటా పెద్ద ప్రయివేట్ దాతల నుంచే ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల సమస్యను ఇప్పటివరకు సుప్రీంకోర్టు పరిష్కరించిన విధానం, దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చటానికి బిజెపి ప్రయత్నించిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇందులో భాగంగా, అవినీతికి వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామనే ఆలోచన కలిపించే ప్రయత్నంలో భాగంగా ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా దర్యాప్తు సంస్థలను, ముఖ్యంగా ఇడిని మోడీ సర్కారు ఆయుధంగా వాడుతున్నదని వారు అంటున్నారు.

బిజెపి పాలనలో పెరిగిన ఇడి దాడులు

2005-2014 మధ్య, యూపీఏ హయాంలో ఇడి దాదాపు 112 సోదాలు నిర్వహించింది. 104 ఫిర్యాదులను కలిగి ఉన్నది. అయితే 2015-2022 మధ్య, బిజెపి ప్రభుత్వ హయాంలో ఇడి సోదాలు 3010 కాగా.. 888 వరకు ఫిర్యాదులు ఉన్నాయి. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులపై 100కు పైగా సోదాలు జరిగాయి. బిజెపి, ఇతర పార్టీల నుంచి ఆ పార్టీలోకి వెళ్లిన నాయకులు, దాని మిత్రపక్షాలపై వచ్చిన ఆరోపణలను మాత్రం ఇడి పట్టించుకోకపోవటం గమనార్హం. ఇడి ద్వారా మొత్తం కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష నాయకులపై నమోదు చేయబడ్డాయని రాజకీయ విశ్లేషకులు కొన్ని గణాంకాలను ఉదహరిస్తున్నారు.

కేవలం రాజకీయ ప్రత్యర్థుల మీద మాత్రమే కాదు.. అన్ని రకాల విమర్శకులపైనా కేంద్ర ఏజెన్సీ సంస్థలు విరుచుకుపడుతున్నాయి. ఫ్యాక్ట్‌చెక్ వెబ్‌సైట్ ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహ్మద్ జుబైర్‌ను సుప్రీంకోర్టు విడుదల చేయటానికి ముందు మోడీ సర్కారు ఆయనను జైలుకు వెళ్లేలా చేసిందనీ, బిబిసి, భాస్కర్ మీడియా గ్రూప్‌లపై ఐటీ శాఖ దాడులు చేసిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అలాగే, గతేడాది ఆక్స్‌ఫామ్ ఇండియా, ఇండిపెండెంట్ అండ్ పబ్లిక్-స్పిరిటెడ్ మీడియా ఫౌండేషన్, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ కార్యాలయాలపై ఐటీ అధికారులు దాడులు చేశారు. ఎన్‌జిఒలు, మరికొన్ని పరిశోధన థింక్ ట్యాంక్‌లకు విదేశీ నిధులు అందకుండా ఎఫ్‌సీఆర్ఎ, 2010 లైసెన్సులను మోడీ సర్కారు రద్దు చేసిందని విశ్లేషకులు, మేధావులు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపక్షాలను బలహీనపర్చేందుకు బిజెపి కుట్ర

- యథేచ్ఛగా కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాలను బలహీనపర్చేందుకు బిజెపి కుట్ర చేస్తోందని, ఇందులో భాగంగానే ప్రతిపక్ష పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకొని కేంద్ర దర్యాప్తు సంస్థలు అయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని, కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)ని, ఆదాయ పన్ను విభాగం (ఐటి)ని దుర్వినియోగం చేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ ఆమె మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఖండించారు. 'కేజ్రీవాల్ అరెస్టును చాలా తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది చట్టవిరుద్ధమైన చర్య. రాబోయే ఎన్నికలను ప్రభావితం చేసేందుకే బిజెపి ఈ చర్యకు దిగింది. ప్రతిపక్షాలను వేటాడేందుకు అధికార పార్టీ చాలా స్పష్టంగా ఇడిని అస్త్రంగా ఉపయోగిస్తోంది. ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం, వేధించడం ద్వారా ప్రతిపక్షాల ఫోరాన్ని బలహీనపరచాలని బిజెపి కుట్ర పన్నుతుంది" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో ముఖ్యమంత్రులను అరెస్టు

చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ కుటుంబాన్ని కూడా ఇతరులు కలవనివ్వకుండా ఆంక్షలు విధించడం చట్టవిరుద్ధమని ఆమె తెలిపారు. ఎన్నికల బాండ్లు బిజెపి తీసుకొచ్చిన అత్యంత అవినీతికర వ్యవస్థ అని బృందాకరత్ విమర్శించారు. ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బిఐ సకాలంలో విడుదల చేయకపోవడం వెనుక బిజెపి ఒత్తిళ్లున్నట్లు కనిపిస్తోందని తెలిపారు. బాండ్ల పూర్తి వివరాల వెల్లడికి మూడు నెలల గడువు కోరడం పాలకపక్ష సిగ్గుమాలిన తనానికి నిదర్శనమన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించి బెదిరించడం లేదా కాంట్రాక్టులు కట్టబెట్టడం వంటి ద్వారా బిజెపి ఎన్నికల బాండ్లను తనకు నిధులు సమకూర్చే సాధనంగా మార్చుకొని క్విడ్‌ప్రోకు పాల్పడిందని తప్పుబట్టారు.

మంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం పొన్మడిని అభినందిస్తున్న తమిళనాడు గవర్నర్ రవి

సుప్రీం మొట్టికాయలతో దిగొచ్చిన గవర్నరు రవి

- క్యాబినేట్‌లోకి పొన్మడి

చెన్నై : సుప్రీంకోర్టు గట్టిగా మొట్టికాయలు వేసిన ఒక రోజు తరువాత తమిళనాడు గవర్నరు ఆర్ఎన్ రవి దిగొచ్చారు. మాజీ మంత్రి కె పొన్మడిని రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకున్నారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో పొన్మడి చేత గవర్నర్ ప్రమాణస్వీకరాం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, మంత్రి ఉధయనిధి స్టాలిన్, కొద్ది మంది అధికారులు మాత్రమే పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా రాజ్‌భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి, పొన్మడి, ఉదయనిధి స్టాలిన్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఇంతకు ముందు పొన్మడిని మంత్రవర్గంలోకి తీసుకోవాలనే ముఖ్యమంత్రి స్టాలిన్ సిఫార్సును గవర్నర్ తిరస్కరించారు. దీంతో సుప్రీంకోర్టును తమిళనాడు ప్రభుత్వం ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటీషన్‌ను గురువారం సుప్రీంకోర్టు విచారించింది. రాజ్యాంగానికి అతీతంగా వ్యవహరిస్తున్నారని గవర్నర్ రవిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పొన్మడిని మంత్రివర్గంలోకి తీసుకోవడంపై 24 గంటల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. లేకుంటే తాము జోక్యం చేసుకోవాల్సివుంటుందని హెచ్చరించింది.

మోడీకి భూటాన్ పురస్కారం

థింపూ : భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది డ్రుక్ గ్యాల్పో'ను భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం అందుకున్నారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ మోడీకి ఈ అవార్డును అందచేశారు. ఈ అవార్డును అందుకున్న మొదటి విదేశీ ప్రభుత్వాధినేతగా మోడీ నిలిచారు. మోడీ ప్రస్తుతం రెండు రోజుల పర్యటన కోసం భూటాన్‌లో ఉన్నారు. గురువారమే మోడీ అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ భారత్-భూటాన్ మధ్య స్నేహం నూతన శిఖరాలకు చేరుకుంటుందని అన్నారు.

ఇండోనేషియా అధ్యక్ష ఎన్నికల్లో విజేతగా వివాదాస్పద రక్షణ మంత్రి

జకర్త : ఇండోనేషియా అధ్యక్ష్య ఎన్నికల్లో ప్రబోవో సుబియాంటో విజయం సాధించారు. నియంతృత్వ పాలనలో రక్షణ మంత్రిగా పనిచేసిన సుబియాంటోపై అనేక వివాదాలు ఉన్నాయి. కిడ్నాప్‌లు, కార్యకర్తలను హింసించడం వంటి ఆరోపణలను సుబియాంటో ఎదుర్కొంటున్నారు. అయినా ఆయనపై ఎప్పుడూ విచారణ జరగలేదు. బుధవారం జరిగిన ఎన్నికల్లో సబియాంటోకు 58.6 శాతం ఓట్లు లభించాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన జకర్తా మాజీ గవర్నర్ అనీస్ బస్వేదన్‌కు 24,9 శాతం ఓట్లు, సెంట్రల్ జావా మాజీ గవర్నర్ గంజర్ ప్రనోవోకు 16.5 శాతం ఓట్లు లభించాయని ఇండోనేషియా సార్వత్రిక ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఎన్నికల ఫలితాలపై కోర్టులో సవాల్ చేస్తామని ఓటమి చెందిన మాజీ గవర్నర్లు ప్రకటించారు. ఎన్నికల ఫలితాలను అంగీకరించడానికి వారు నిరాకరించారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు.

నీటికి కటకట

- దేశంలో అడుగంటుతున్న ప్రధాన జలాశయాలు
- సగటు రిజర్వాయర్ల నీటి మట్టం 38 శాతమే

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఈ మండు వేసవిలో నీటికి తిప్పలు తప్పేలా లేవు. దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ నీటి కొరత ముంచుకొస్తోంది. దేశంలోని ప్రధాన జలశయాల్లో నీటి మట్టాలు అంతకంతకూ కుచించుకుపోతున్నాయి. రిజర్వాయర్లలో కనీస నీటి నిల్వల స్థాయిలు సగటున 38 శాతానికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే దక్షిణ భారత్‌లోని రిజర్వాయర్లలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కేంద్ర జల సంఘం (సెంట్రల్ వాటర్ కమిషన్ - సిడబ్ల్యుసి) ఈ మేరకు నివేదిక విడుదల చేసింది. దాని ప్రకారం.. దేశంలోని 150 ప్రధాన రిజర్వాయర్లలో వాటి నీటి నిల్వ మొత్తం సామర్థ్యంలో ప్రస్తుతం నీటి మట్టాలు సగటున 38 శాతానికే పరిమితమయ్యాయి. బెంగళూరు లాంటి మహానగరాలు ఇప్పటికే తీవ్రమైన నీటి కొరతతో అవస్థలు పడుతున్నాయి. బెంగళూరులో రోజువారీ అవసరాల డిమాండ్ 260 కోట్ల లీటర్లుగా ఉండగా..ప్రస్తుతం సుమారు 50 కోట్ల లీటర్ల నీటి కొరత నెలకొంది. గతేడాదితో పోలీస్తే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జలశయాల్లో నీటి నిల్వలు బాగా తగ్గిపోయాయి.

బెంగళూరులో 14 వేల బోరుబావులున్నాయి. వీటిలో 6900 ఇప్పటికే ఎండిపోయాయి. నగరంలోని జలాశయాల్లో చాలా వరకు ఆక్రమణకు గురికావడం లేదా ఎండిపోవడం కనిపిస్తోంది. 'రోజువారీ 260 కోట్ల లీటర్లు నీరు డిమాండ్ ఉండగా.. 147 కోట్ల లీటర్ల నీరు కావేరీ నది నుంచి అందుతోంది. మరో 65 కోట్ల లీటర్ల నీరు బోరుబావుల ద్వారా అందుతోంది' అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు.

ఉమ్మడి జలాశయాలు కలిగియున్న తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్, త్రిపుర, రాజస్థాన్, బీహార్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ సహా అనేక రాష్ట్రాల్లో గతేడాదితో పోలీస్తే నీటి మట్టాలు కుచించుకుపోయాయి. దేశ నీటి అవసరాల అంచనా 257.812 178.784 బిసిఎం (శతకోటి ఘనపు మీటర్లు) ఉండగా అందులో 69.35 శాతం ఈ రాష్ట్రాల్లోని 150 ప్రధాన రిజర్వాయర్లపైనే ఆధారపడివుంది. ఈ రిజర్వాయర్ల నీటి సామర్థ్యం 178.784 బిసిఎం (శతకోటి ఘనపు మీటర్లు)గా ఉండగా ..ఈ నెల 21 నాటి గణాంకాల ప్రకారం..అందులో 38 శాతం అంటే 67.591 బిసిఎం (శతకోటి ఘనపు మీటర్లు) నీరు మాత్రమే అందుబాటులో ఉంది. పదేళ్ల సగటు నీటి సామర్థ్యం 72.396 బిసిఎం (శతకోటి ఘనపు మీటర్లు) కాగా గతేడాది ఇదే సమయానికి 80.557 బిసిఎం (శతకోటి ఘనపు మీటర్లు) నీరు అందుబాటులో ఉండేది. అందువల్ల గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం ఈ 150 ప్రధాన రిజర్వాయర్లలో 84 శాతం నీటి కొరత ఎదుర్కొంటుండగా..పదేళ్ల కాలంతో పోల్చి చూస్తే 93 శాతం కొరత ఎదుర్కొంటోంది.

నాగార్జునా సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను ఉమ్మడిగా కలిగియున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడులోని 42 రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం 53.334 బిసిఎం (శతకోటి ఘనపు మీటర్లు)గా ఉండగా..ఈ నెల 21 గణాంకాల ప్రకారం..వీటిలో నీటి నిల్వ 12.287 బిసిఎం (శతకోటి ఘనపు మీటర్లు)గా మాత్రమే ఉంది. అంటే వాటి మొత్తం నీటి నిల్వ సామర్థ్యంలో ఇది 23 శాతం మాత్రమే. గతేడాది గణాంకాలతో పోలిస్తే ఇది 39 శాతం, పదేళ్ల సగటుతో పోలిస్తే 32 శాతం తక్కువ. దక్షిణ భారత్‌లోని ప్రధాన జలశయాల నీటి మట్టాల ప్రస్తుత పరిస్థితిని పరిగణలోకి తీసుకుంటే రాబోయే రోజుల్లో నీటికి ఇబ్బందులు తప్పవు అని తెలుస్తోంది.

వాతావరణ లక్ష్యాల సాధనకు అణు ఇంధనమే మార్గం

- ప్రపంచ తొలి అణు ఇంధన సదస్సులో వక్తలు

బ్రస్సెల్స్ : శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడం, ఇంధన భద్రతను పెంపొందించడం, ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహాన్నందించడం వంటి అంతర్జాతీయ సవాళ్ళను ఎదుర్కోవడంలో అణు ఇంధనం ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుందనివక్తలు పేర్కొన్నారు. కర్బన ఉద్గారాలు తగ్గించేందుకు నిర్దేశించుకున్న వాతావరణ లక్ష్యాలను సాధించేందుకు అణు ఇంధనమే మార్గమని తెలిపారు. గురువారం ఇక్కడ ప్రారంభమైన ప్రపంచ తొలి అణు ఇంధన సదస్సులో 30కి పైగా దేశాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో ప్రభుత్వాధినేతలు, నాయకులు, సీనియర్ ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల నేతలు వున్నారు. కేవలం అణు ఇంధనంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తూ జరిగిన మొదటి అత్యున్నత స్థాయి సమావేశం ఇదే. అంతర్జాతీయ ఇంధన సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాతిహ్ బైరోల్ మాట్లాడుతూ, అణు ఇంధనం పోషించే అద్వితీయమైన పాత్రను నొక్కి చెప్పారు. అణు విద్యుత్ మద్దతు లేకుండా వాతావరణ లక్ష్యాలను మనం సకాలంలో సాధించలేమని అన్నారు. ఐఎఇఎ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రాసి మాట్లాడుతూ, పరిశుద్ధమైన ఇంధనంలో నాలుగవ వంతును అణు ఇంధనం అందిస్తోందన్నారు. సురక్షితమైన, భద్రమైన, అణు వ్యాప్తి లేని రీతిలో అణు ఇంధనాన్ని ఉపయోగించేలా తమ సంస్థ సాయపడుతుందని చెప్పారు.

సిఎఎపై పోరు కొనసాగుతుంది

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా ఇక్కడ నివసించే వారందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని, మతం ప్రాతిపదికన విభజించడాన్ని రాజ్యాంగం అనుమతించదన్నారు. సిఎఎ, జాతీయ పౌర పట్టిక అమలుకు తాము మద్దతిచ్చేది లేదని ప్రకటించిన మొదటి రాష్ట్రం కేరళ అని విజయన్ చెప్పారు. సిఎఎకు వ్యతిరేకంగా సుప్రీంను ఆశ్రయించిన మొదటి రాష్ట్రం కూడా కేరళేనని చెప్పారు. దేశంలో చాలా మంది ప్రజలు తమ భవిత్వం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, తాము ఇక్కడ వుండగలమా లేదా అని వారు భయపడుతున్నారని అన్నారు. సంఘ్ పరివార్ బెదిరింపులు కూడా ఈ భయానికి ఒక కారణమన్నారు. సిఎఎపై తన వైఖరిని కాంగ్రెస్ నాయకత్వం ఇంతవరకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ లోక్‌సభకు పోటీ చేస్తున్న ఎల్‌డిఎఫ్ అభ్యర్థుల ప్రచారానికి వేదికగా మారింది. ఎల్‌డిఎఫ్ అభ్యర్థులైన ఎలామరమ్ కరీమ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, కెకె శైలజ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

ఇజ్రాయిల్ అమానవీయ దాడులకు సర్వం కోల్పోయి బిక్కుబిక్కుమంటు కాలం వెళ్లదీస్తున్న గాజా వాసులు

శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలి

- గాజాలో కాల్పుల విరమణ జరగాలి
- ఇజ్రాయిల్‌కు అమెరికా, ఈజిప్ట్ పిలుపు

కైరో : ఇజ్రాయిల్, హమాస్ శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని, గాజాలో కాల్పుల విరమణ జరగాలని ఈజిప్ట్, అమెరికా కోరాయి. ప్రస్తుతం ఈజిప్ట్‌లో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఈజిప్ట్, సౌదీ అరేబియా, జోర్డాన్, కతార్‌ల విదేశాంగ మంత్రులతో బహుళపక్ష సమావేశం జరిపారు. ఈ సమావేశంలో పాలస్తీనా విమోచన సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రధాన కార్యదర్శి, యుఎఇ అంతర్జాతీయ సహకార మంత్రి కూడా పాల్గొన్నారు.

ఈ సమావేశాలనంతరం బ్లింకెన్ ఈజిప్ట్ విదేశాంగ మంత్రి సామేహ్ శౌక్రితో కలిసి పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఇజ్రాయిల్ బందీలను, పాలస్తీనా ఖైదీలను విడుదల చేసి, గాజాలో తక్షణమే కాల్పుల విరమణను అమలు చేయాల్సిన ఆవశ్యకత వుందని అన్నారు. అలాగే గాజాలో మానవతా సాయాన్ని కూడా విస్తరించాల్సి వుందన్నారు. ఇప్పటికే గాజాలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, ఇటువంటి స్థితిలో రాఫాలో మిలటరీ ఆపరేషన్ ఆలోచననలు విడిచిపెట్టాలని వారు కోరారు. ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలు నెలకొనేందుకు ప్రస్తుత సంక్షోభాన్ని సమూలంగా పరిష్కరించుకోవాల్సి వుందన్నారు. ఇజ్రాయిల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ క్లిష్టమైనదే అయినా అవకాశాలున్నాయని బ్లింకెన్ పేర్కొన్నారు.

రోజూ 37 మంది తల్లులు చనిపోతున్నారు

గాజాలో దాడులతో ప్రతిరోజూ సగటున 37 మంది తల్లులు మరణిస్తున్నారని పాలస్తీనా రెడ్ క్రిసెంట్ సొసైటీ తెలిపింది. మార్చి 21న అరబ్ ప్రపంచం మాతృ దినోత్సవాన్ని జరుపుకుంటుంది. ఈ సందర్భంగా ఒక ప్రకటన చేస్తూ గాజాలో యుద్ధంతో ప్రతి రోజూ తల్లులు, పిల్లలు అధిక సంఖ్యలో మృతి చెందుతున్నారని, మహిళా ఖైదీలపై దాడులు, నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. వారి భర్తలు, కొడుకుల సమాచారం కోసం మహిళలను బందీలుగా చేసి చాలా దారుణంగా ప్రవర్తిస్తున్నారని తెలిపింది. పాలస్తీనా మహిళలపై జరుగుతున్న ఈ నేరాలకు అంతర్జాతీయ మహిళా సంఘాలు, సంస్థలే బాధ్యత వహించాలని ఆ ప్రకటన పేర్కొంది.

సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర ఖండన

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఇడి అరెస్టు చేయడాన్ని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనను అది విడుదల చేసింది. మోడీ ప్రభుత్వ పనితీరు, ప్రభుత్వ అవినీతి బహిర్గతం కావడం, ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు తీర్పు వంటి వాటితో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుండడం బిజెపిని బెంబేలెత్తిస్తోంది. దీంతో ప్రతిపక్ష నాయకులపై ప్రతీకారేచ్ఛతో దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తున్నదని పొలిట్‌బ్యూరో విమర్శించింది. అరెస్టయిన ఇండియా వేదికకు చెందిన రెండో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అని పొలిట్‌బ్యూరో గుర్తు చేసింది. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం బిజెపిని ఓడించడానికి కట్టుబడి ఉన్న ప్రతిపక్ష నాయకుల్ని దర్యాప్తు సంస్థలు లక్ష్యంగా చేసుకుంటాయని, బిజెపిలో ఫిరాయించిన వారికి రక్షణ, కానుకలు లభిస్తున్నాయని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఢిల్లీలోనూ, దేశవ్యాప్తంగానూ జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని తన శాఖలకు పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది.

కేజ్రీవాల్‌కు ఆరు రోజులు ఇడి కస్టడీ

- రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష నాయకులను వేటాడే కార్యక్రమంలో భాగంగా గురువారం అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఆరు రోజుల పాటు (ఈనెల 28 వరకు) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కస్టడీకి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం అనుమతిచ్చింది. వైద్య పరీక్షల అనంతరం కేజ్రీవాల్ ను రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచిన ఇడి, ఆయనను తన కస్టడీకి పంపాలని 28 పేజీల రిపోర్టును సమర్పించింది. ఇడి తరపున సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తన వాదన వినిపిస్తూ, ఈ కేసులో కేజ్రీవాల్ కీలక సూత్రధారి అని, మద్యం పాలసీ అమలులో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారని ఆరోపణల చిట్టా చదివారు. 'ఇందులో సౌత్ గ్రూప్‌నకు అనుకూలంగా వ్యవహరించారని, ఇది రూ.వంద కోట్ల స్కామ్ కాదు, రూ.600 కోట్ల స్కామ్ అని. ఇందులో కేజ్రీవాల్‌కు రూ.300 కోట్లు అందాయని ఆ చిట్టాలో పేర్కొన్నారు. . ఈ డబ్బే పంజాబ్, గోవా ఎన్నికల్లో ఖర్చుపెట్టిందని, రూ.45 కోట్లు హవాలా ద్వారా గోవాకు పంపారని, ఆప్, సౌత్ గ్రూప్‌ల మధ్య విజయ్‌నాయర్ వారధిగా ఉన్నారని పకడ్బందీగా స్క్రిప్టును రూపొందించారు. విజయ్ నాయర్ కంపెనీ నుంచి అన్ని ఆధారాలూ సేకరించామని, మా దగ్గర అన్ని ఆధారాలూ ఉన్నాయి' అని ఇడి తెలిపింది. ఈ కేసులో కేజ్రీవాల్‌ను పది రోజులు కస్టడీకి కోరింది.

ఈ కేసులోనే అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా బెయిల్ లభించలేదన్న విషయాన్నిన్యాయస్థానం దష్టికి ఈడి తీసుకెళ్లింది. ఈ కేసులో సహ నిందితురాలుగా ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత వాంగ్మూలాన్ని కూడా తీసుకున్నామని, రెండు పర్యాయాలు నగదు బదిలీ జరిగిందని ఇడి తన రిపోర్టులో ఆరోపించింది. సౌత్ గ్రూప్‌కు లిక్కర్ పాలసీలో లబ్ది చేకూర్చేందుకు ముడుపులు తీసుకున్నారని, దీనిలో భాగంగా ఎమ్మెల్సీ కవితను కేజ్రీవాల్ కలిశారని, కలిసి పని చేద్దామంటూ కవితతో సిఎం కేజ్రీవాల్ చెప్పారని ఇడి పేర్కొంది.

తన జీవితం దేశానికి అంకితం: కేజ్రీవాల్

తన జీవితం దేశానికి అంకితమని, లోపల ఉన్నా, బయట ఉన్నా దేశం కోసం పనిచేస్తుంటానని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మద్యం కుంభకోణం కేసులో ఈడి అరెస్ట్ తర్వాత ఆయన తొలిసారి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎక్కడ ఉన్నా దేశం కోసం పనిచేస్తుంటానని పేర్కొన్నారు. శుక్రవారం కేజ్రీవాల్‌ను కోర్టు లో ప్రవేశపెట్టడానికి తీసుకెళ్తున్నప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు : కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన నేపథ్యంలో దేశ చరిత్రలో గురువారం మరో చీకటి రోజుగా మిగిలిపోనుందని తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా పరిణమిస్తున్న బిజెపి చర్యలను బిఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ మేరకు కెసిఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేజ్రీవాల్ అరెస్టును ఒక రాజకీయ ప్రేరేపిత చర్యగా ఆయన అభివర్ణించారు. ఢిల్లీ సిఎంపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతిపక్షాలను నామరూపాల్లేకుండా చేయాలనే ఏకైక సంకల్పంతో కేంద్రంలోని బిజెపి వ్యవహరిస్తోందని విమర్శించారు. ఝార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టులు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం ఇడి, సిబిఐ, ఐటీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ సర్కారు పావులుగా వాడుకుంటోందని విమర్శించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ మేరకు కేజ్రీవాల్ పిటిషన్‌ను సిజెఐ ప్రత్యేక ధర్మసనానికి కేటాయించారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ బేలా త్రివేదిలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ముందుకు కేజ్రీవాల్ అరెస్ట్ పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు, దీనిపై విచారణ ట్రయల్ కోర్టులో రిమాండ్ ప్రొసీడింగ్స్‌తో క్లాష్ అవుతుందని కేజ్రీవాల్ తరపు లాయర్లు అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఈ కారణంగా పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని కోరారు. ట్రయల్ కోర్టు తీర్పునకు అనుగుణంగా మరో పిటిషన్‌తో సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు వివరించారు.

నిరంకుశ శక్తులపై గళమెత్తుదాం : కానెల్

హవానా : అధికార కేంద్రాల నిరంకుశ శక్తికి వ్యతిరేకంగా ప్రజాపక్ష గొంతుకలు ఏకమవ్వాలని క్యూబా అధ్యక్షులు మిగ్వెల్ డియాజ్ కానెల్ పిలుపునిచ్చారు. సోమ, మంగళవారాల్లో హవానాలో జరిగిన మూడవ అంతర్జాతీయ కొలాక్వియం పాట్రియా సమావేశంలో ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన వందమందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సామ్రాజ్యవాద దాడి కొనసాగుతున్నప్పటికీ వామపక్షాలు మరింత మెరుగైన, స్పష్టమైన ఆలోచనా ధోరణితో వ్యవహరించగలవని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాజ్ కానెల్ మాట్లాడుతూ, ఈ సమావేశంలో వివిధ రకాలైన స్వరాలను వినిపించారని, ఆ రకంగా ఈ సమావేశంలో నిజమైన భావోద్వేగాలు వ్యక్తమయ్యాని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గల మేధావులందరితో సమావేశమై, వారితో సంభాషించాలన్నదే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. అధికార కేంద్రాల నిరంకుశ శక్తికి వ్యతిరేకంగా అన్ని స్వరాలను పరిగణనలోకి తీసుకునే సరికొత్త ప్రపంచ సమాచార, కమ్యూనికేషన్ వ్యవస్థపై వీరంతా చర్చించారు. సున్నితత్వం, మేధావితనం కలబోసినపుడల్లా భావోద్వేగాల తీవ్రత చాలా ఎక్కువగా వుండడం అనివార్యంగా జరుగుతుందన్నారు. నేడు ఈ సమావేశ వేదికపై జరుగుతున్నది కూడా అదేనన్నారు. ప్రేమ, కరుణ, దయ వంటి అన్ని రకాల గుణాల కలబోతగా విప్లవకారులు వుంటారని, తన సాటివారి పట్ల సహోదరుడిగా మెలగాలనే మానవుని ఆకాంక్షే ఇందుకు కారణంగా వుంటుందని అన్నారు.

దేశవ్యాపిత నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

మూసివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆప్ నాయకుడు, ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ శుక్రవారం నాడిక్కడ మాట్లాడుతూ, బిజెపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, నియంతృత్వాన్ని దేశంపై రుద్దుతోందని విమర్శించారు. మొదట తప్పుడు కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేశారు. ఇప్పుడు శాంతియుతంగా ఆందోళన చేపడుతున్న వారిని కూడా అరెస్ట్ చేస్తున్నారని మరో మంత్రి అతిషి విమర్శించారు. కేజ్రీవాల్ అరెస్టుపై గురువారం ముంబయిలోని ఇడి కార్యాలయం ఎదుట ఆప్ నిరసన తెలిపింది.

ఇసికి ఇండియా ఫోరం నేతల ఫిర్యాదు

ఇండియా ఫోరం నేతలు శుక్రవారం ఎన్నికల సంఘాన్ని కలిసి ఎన్నికల సమయంలో కేంద్ర సంస్థల దుర్వినియోగంపై ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. ఎన్నికలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సోదాహరణంగా వారు ఆ మెమోరాండంలో వివరించారు. "వివిధ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీ, హోం సెక్రటరీ, డిజిపి సహ ఉన్నతాధికారులను నియంత్రించే, మార్చే విషయంలో వ్యవహరిస్తున్న ఎన్నికల సంఘం, బిజెపి చేతిలో రాజకీయ ఆయుధాలుగా మారిన ఈడి, సిబిఐ, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర సంస్థల అధికారులను ఎందుకు నియంత్రించలేకపోతోందని వారు ప్రశ్నించారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరగకుండా బిజెపి యత్నిస్తోందని వారు విమర్శించారు. ప్రతిపక్ష నేతలను, ముఖ్యమంత్రులను ట్రాప్ చేసేందుకు కేంద్ర ఏజెన్సీలు యత్నిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఒక్క సభ్యుడిని కూడా అవి అరెస్టు చేయడం కానీ, విచారించడం కానీ చేయని విషయాన్ని వారు ఈ సందర్భంగా ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల జాబితాను వారు ఇసికి అందజేశారు. ఎన్నికల సంఘం కమిషనర్లను కలిసిన వారిలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, టిఎంసి నేత డెరిక్ ఓబ్రియాన్, కాంగ్రెస్ నేతలు కెసి వేణుగోపాల్, అభిషేక్ మను సింఘ్వీ తదితరులు ఉన్నారు.

మీ కోసం

గాజు వస్తువులను వెనిగర్ కలిపిన నీటితో కడిగితే బాగా శుభ్రపడతాయి.

జీవన సౌరభం

అడిగి తెలుసుకోవడానికి భయపడేవారు నేర్చుకోవడంలో వెనకబడతారు.

పనిలో ఆనందం



తిరుపతిలో ఉన్న కృష్ణస్వామి మామయ్య రాసిన 'నాన్నరం' కథల పుస్తకాన్ని ఇంటికి తెచ్చి ఇస్తూ, 'తిరుపతిలో అనుకోకుండా కృష్ణస్వామి గారిని కలిసాము. ఈ వీధిలో మేమున్నామని తెలిసాక ఆయన రాసిన పుస్తకాన్ని మీ ఇంటిలో ఇవ్వమని ఇచ్చారు' అంటూ చెప్పి వెళ్ళింది పక్కింటి బామ్మ.

పుస్తకాలు చదవడం బాగా ఇష్టమున్న, ఆరవ తరగతి చదువుతున్న అద్విక్ 'ఇప్పుడే ఈ పుస్తకం చదవాలి' అనుకొంటూ పుస్తకాన్ని తీసుకోబోయాడు. 'పుస్తకానికి అట్ట వేసాక చదవాలి' అని అమ్మ షరతు పెట్టింది. అట్ట వేయడానికి కావలసిన అట్ట పేపరు, కత్తెర, బంక బాటిల్‌ను టేబుల్ మీద వుంచి, నిదురపోతున్న నాన్న ఎపుడు లేస్తారా అని చూడసాగాడు అద్విక్.

'మీ నాన్న నిద్ర లేచే లోపున ఉగాది పచ్చడి చెయ్యాలి. లోకనాథం మామయ్య ఇంటిదగ్గరున్న వేపచెట్టులో పువ్వు అడిగి తీసుకునిరా' అంది తల్లి. వేపపువ్వు కోసం అద్విక్ వెళ్ళాడు. అక్కడ ఐదవ తరగతి చదివే చైతన్య, ఓ పొడవాటి కర్ర చివరన కత్తి కట్టి చెట్టుపై ఉన్న వేపపువ్వు కోయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈలోపు లోకనాథం వచ్చి 'చైతన్యా, నేను కోస్తాను' అన్నాడు.

'మామయ్యా, నావల్ల కాకుంటే మిమ్మల్ని సాయం అడుగుతాను. ఎవరి పని వారు చెయ్యాలంట. అలా చేయడం వల్ల ఆనందం వుంటుందట. అలాగని మా రామ్మూర్తి తాతయ్య చెప్పారు' అని లోకనాథాన్ని వారించాడు చైతన్య.

ఆ మాటలు అద్విక్‌ను ఆలోచింప చేశాయి. చైతన్య వెళ్ళాక ఆ కర్ర తీసుకొని వేపపువ్వు కోశాడు. వేపపువ్వు తీసుకెళ్తున్నప్పుడు చాలా ఆనందం కలిగింది. తానే స్వయంగా కోశానని అమ్మతో చెబితే తను కూడా సంతోషించింది. 'పుస్తకానికి అట్ట కూడా నేనే వేసుకుంటాను. నాన్న లేచేదాకా ఎదురుచూడను' అని చెప్పి అట్ట వేసి పుస్తకం చదవడం ప్రారంభించాడు.

ఎప్పుడూ లేనిది ఈ ఏడాది ఉగాది పచ్చడి తింటున్నప్పుడు అద్విక్‌కి అందులో చేదు అనిపించలేదు. బహుశా అది ఇతరుల మీద ఆధారపడకుండా పనిచేయడంలో ఉన్న ఆనందం తాలూకు తీపి కాబోలు.

- ఓట్ర ప్రకాష్ రావు, తిరుత్తణి,
097874 46026.



బొమ్మ గీయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ

వై.జాగృతి,
2వ తరగతి,
ఎస్‌టి జోసెఫ్ గరల్స్ హైస్కూలు,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తత

ఎండలు ముదురుతున్నాయి. ఈ సమయంలో పిల్లల సంరక్షణ చాలా ముఖ్యం. సెలవుల్లో ఆటలు, పాటలు అంటూ పిల్లలు ఎక్కువ సేపు బయటే తిరుగుతూ ఉంటారు. తిండీ, నిద్రనూ నిర్లక్ష్యం చేసి ఆటల్లో మునిగిపోతారు. త్వరగా డీహైడ్రేషన్‌కు గురవుతారు. అందుకే వేసవిలో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

ఎండ తక్కువ ఉన్న సమయాల్లో అంటే ఉదయం, సాయంత్రం వేళ పర్వాలేదు గానీ, మధ్యహ్న సమయంలో అసలు బయటకు పంపవద్దు. ఆ సమయంలో ఎండ ఎక్కువగా ఉంటుంది, రేడియేషన్ కూడా ఎక్కువగా ఉంటుంది. మధ్యహ్న సమయంలో పిల్లలకి కథలు చెప్తూ, పుస్తకాలు చదివిస్తూ, బొమ్మలు వేయిస్తూ, ఇంట్లో ఆడుకునేలా చూడాలి.

బయట వాతావరణం చాలా వేడిగా ఉండడం వల్ల పిల్లల శరీర ఉష్ణోగ్రత పెరిగి.. చెమట ఎక్కువగా పడుతుంది. ఒంట్లో నీరు వేగంగా ఆవిరై.. డీహైడ్రేషన్‌కు గురవుతారు. ఈ పరిస్థితులు వడదెబ్బకు దారితీస్తాయి.

పండ్లు ఇవ్వాలి

వేసవిలో పిల్లల చర్మం పొడిబారి, దురద, మంట వంటి పలురకాల ఎలర్జీలు మొదలైతే వారు డీహైడ్రేషన్‌కు గురైనట్లు గుర్తించాలి. యూరిన్‌కు అతి తక్కువగా వెళ్లడం, కడుపునొప్పి, తలనొప్పి, వికారంగా ఉన్నా గమనించాలి. మామిడి, ద్రాక్ష, పైనాపిల్, పుచ్చ, కమలా జ్యూస్‌లు పట్టించాలి. రోజూ ఉదయం గ్లాసు కొబ్బరినీళ్లు ఇవ్వాలి. ఇందులోని పొటాషియం వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. పిల్లలతో రోజుకి కనీసం రెండు లీటర్ల నీటిని తాగించడం అన్నింటికన్నా ముఖ్యం. సబ్జా నీళ్లు ఇచ్చినా మంచిది.

గాలి తగిలేలా ...

బయటి వాతావరణం వేడిగా ఉన్నప్పుడు చిన్నారులకు తేలికైన, కాటన్ వస్త్రాలను వేయాలి. ఇవి సింథటిక్, ఇతర ఫ్యాబ్రిక్స్ కంటే చెమటను ఎక్కువగా పీల్చుకుంటాయి. అలాగే లేత రంగు దుస్తులను వేయాలి. ఇంట్లో వీలైనంత చల్ల గాలి వచ్చేలా చూడాలి. అధిక వేడి వల్ల ఉక్కపోత, చెమటతో పిల్లలు ఉక్కిరి బిక్కిరి అయిపోతారు. కాబట్టి ఎక్కువ గాలి తగిలేలా చూడాలి. రెండు పూటలా స్నానం చేయించాలి. బయట ఆటలాడి ఎక్కువగా చెమట పడుతుంది. నిర్లక్ష్యంగా వదిలేస్తే అలర్జీలు వచ్చే అవకాశం ఉంది.

మజ్జిగ తాగించాలి

మధ్యాహ్నం భోజనం తర్వాత పలుచని మజ్జిగలో చిటికెడు జీలకర్రపొడి, ఉప్పు, పావుచెక్క నిమ్మరసం కలిపి తాగిస్తే జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. మజ్జిగలో కాల్షియం, విటమిన్ బి12, పొటాషియం అందుతాయి. ఇవి తలనొప్పి, వికారం వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని ఇస్తాయి. క్యారెట్, కీరదోస ముక్కలపై కాస్త నిమ్మ రసం, చిటికెడు ఉప్పు చల్లి తినిపించడం చాలా మంచిది.

మసాలాలు వద్దు

వేసవిలో కారం, మసాలా, వేపుళ్లు, స్వీట్లు వంటి వాటికి పిల్లలను దూరంగా ఉంచాలి. పిజ్జా, బర్గర్, నిల్వ ఆహారాన్ని ఇవ్వకూడదు. ఇవన్నీ దాహాన్ని మరింత పెంచుతాయి. ఎక్కువగా ఇంట్లో తాజాగా వండిన ఆహారాన్నే తీసుకునేలా చూడాలి.

ఫ్రిజ్‌లోవి వద్దు..

వేసవిలో వండిన పదార్థాలు త్వరగా చెడిపోతాయి. దీంతో చాలా మంది ఫ్రిజ్‌లో పెట్టి వేడి చేసుకుని తింటుంటారు. ఈ పదార్థాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. పిల్లలకు ఇవి పెట్టకూడదు. పిల్లల్లో వాంతులు, విరేచనాలు అయ్యే ప్రమాదం ఉంది. పిల్లలు ఫ్రిజ్ నీళ్లు తాగితే జలుబు చేసే అవకాశం ఉంది. కాబట్టి కుండ నీళ్లు ఇవ్వడం చాలా మంచిది.

కూలింగ్ గ్లాసెస్

అత్యవసర పరిస్థితుల్లో పిల్లలు ఎండలో బయటకు రావాల్సి వస్తే తప్పనిసరిగా కూలింగ్ గ్లాసెస్ పెట్టుకునేలా చూడాలి. కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుంటే సూర్యుని కిరణాలు డైరెక్ట్‌గా కళ్లల్లో పడవు, కళ్లు సేఫ్‌గా ఉంటాయి. క్యాప్ పెట్టుకుంటే ఎండ డైరెక్ట్‌గా వారి తల మీద పడదు. ఎండ తలమీద పడితే తలనొప్పి, విసుగు, కళ్లు తిరిగే అవకాశం ఉంటుంది. బయట నుంచి ఇంటికి వచ్చిన తర్వాత చల్లటి నీళ్లోతో కళ్లు శుభ్రంగా కడిగితే వారికి ప్రశాంతంగా ఉంటుంది.

సన్‌స్క్రీన్

పిల్లలు బయటకు వెళ్లాల్సి వస్తే ఎండ తగిలే భాగాలకు సన్‌స్క్రీన్ లోషన్ రాయడం మంచిది. సన్‌స్క్రీన్ పిల్లలను సన్‌బర్న్ నుంచి రక్షిస్తుంది. పిల్లలు బయట ఉండే సమయం బట్టి సన్‌స్క్రీన్ రెండు సార్లు రాసినా పర్వాలేదు. చెమట ఎక్కువగా పట్టినప్పుడు సన్‌స్క్రీన్ తొలగిపోతుంది.

ఆరోగ్యానికి ఆకుకూరలు

ఆకుకూరలు ... చౌకగా లభ్యమయ్యే మంచి పోషక విలువలు కలిగిన ఆహారం. తోటకూర, చుక్కకూర, బచ్చలికూర, పొన్నగంటికూర, గోంగూర, మెంతికూర, చేమ, ముల్లంగి ఆకులు ... ఇలా ఎన్నో రకాల ఆకులు అందుబాటులో ఉన్నాయి.

ఎండాకాలంలో ఆకుకూరలు తింటే తేలిగ్గా జీర్ణమై పోషకాలను అందిస్తాయి. రోగ నిరోధకశక్తిని పెంచుతాయి. రోజూ వంద గ్రాముల ఆకుకూరలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. శరీరానికి అవసరమయ్యే సూక్ష్మ పోషకాలు ఆకుకూరల్లో మెండుగా ఉంటాయి. మాంసకృత్తులు, ఒమెగా 3 కొవ్వులు, విటమిన్ ఇ పుష్కలంగా ఉండే ఆకుకూరలు రోగ నిరోధకతను పెంచటంలో దోహదపడతాయి. వీటిలో ఫోలిక్ యాసిడ్ కూడా ఎక్కువగా ఉంటుంది. వీటిని తీసుకుంటే రక్తహీనత సమస్య రాదు. తోటకూర, గోంగూర, కరివేపాకులలో ఎక్కువ మొత్తంలో పీచు లభిస్తుంది. దాంతో ఆహారం చక్కగా జీర్ణమై మలబద్ధకం సమస్య ఉండదు. అధిక రక్తపోటుతో బాధపడేవారికి ఆకుకూరలు మేలు చేస్తాయి. ఆకుకూరల్లో ఉండే ల్యూటిన్, కెరోటిన్ యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేసి క్యాన్సర్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తాయి. ఆకుకూరలను నీటిలో శుభ్రంగా కడిగి తడి పోయేలా తుడిచి, ఆరబెట్టుకోవాలి. టిష్యూ పేపర్ లేదా మందమైన వస్త్రంలో చుట్టి పెట్టుకోవచ్చు. వేర్లతో నిల్వ చేస్తే త్వరగా పాడవుతాయి. కడిగేటప్పుడు ఎక్కువ సేపు నీటిలో ఉంచకూడదు.

'దేవర' సెట్స్‌లో ఎన్‌టిఆర్

ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర' సినిమా షూటింగ్ శరవేగంగా చేస్తున్నారు. ప్రస్తుతం గోవాలో చిత్రీకరణ జరుగుతోంది. గోవా షెడ్యూల్‌లో సినిమాలోని యాక్షన్ సన్నివేశాలతో పాటు జాన్వీ కపూర్‌తో ఓ సాంగ్‌ను చిత్రీకరించనున్నారు. శుక్రవారం ఈ సినిమా సెట్ నుంచి ఓ వీడియో లీక్ అయ్యింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ లొకేషన్ నుంచి ఒక ఫోటోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఈ ఫొటోలో ఎన్టీఆర్, కొరటాల శివ ఉన్నారు. ఈ సినిమా రెండు పార్టులుగా రాబోతుంది. మొదటి పార్ట్‌ను అక్టోబర్ 10న విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ నటిస్తుండగా సైఫ్ అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించబోతున్నాడు.

లక్నోలో 'మిస్టర్ బచ్చన్'



రవితేజ, హరీష్ శంకర్ కాంబోలో వస్తున్న 'మిస్టర్ బచ్చన్' సినిమా షూటింగ్ దశలో ఉంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా కొత్త షెడ్యూల్ లక్నోలో ప్రారంభమైంది. రవితేజ త్వరలోనే ఈ సెట్స్‌లో జాయిన్ అవుతారని తెలుస్తోంది. లక్నోలో కీలక సన్నివేశాలు చిత్రీకరించబోతున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌తో 50 శాతం సినిమా పూర్తి కాబోతుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే రవితేజ సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు. మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు.

హిందీలో 'ఉప్పెన' రీమేక్

తెలుగులో అనూహ్య విజయాన్ని సొంతం చేసుకున్న సినిమా 'ఉప్పెన'. వైష్ణవతేజ్, కృతిశెట్టి ఈ సినిమా ద్వారానే ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. నటుడు విజయ్ సేతుపతి ప్రతి నాయకుడు పాత్రలో మెప్పించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని తమిళం, బాలీవుడ్‌లో రీమేక్ చేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాజాగా రామ్‌చరణ్- జాన్వీకపూర్‌ల కొత్త ప్రాజెక్టు ఆర్‌సి16 ప్రాజెక్టు ప్రారంభ కార్యక్రమానికి బోనీకపూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగానే బోనీకపూర్ మాట్లాడుతూ, ఉప్పెనను హిందీలో రీమేక్ చేస్తానని ప్రకటించారు. తన చిన్నకూతురు ఖుషీకపూర్‌ను హీరోయిన్‌గా పెట్టాలని భావిస్తున్నట్లుగా సమాచారం.

ఆహ్లాదకర వాతావరణంలో 'తండేల్'

నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. చందూ మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ పతాకంపై బన్నీ వాసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. తాజాగా 'తండేల్' సెట్స్ నుంచి కొన్ని షూట్ డైరీస్‌ని మేకర్స్ విడుదల చేశారు. సెట్స్‌లో ఇంటెన్స్, ఫ్యాషన్ నిండిన ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోంది. ఒక ఫోటోలో చందూ మొండేటి.. అల్లు అరవింద్‌కి ఒక సన్నివేశం గురించి వివరిస్తుండగా.. మరొక ఫోటో బన్నీ వాసు, నాగ చైతన్య, చందూ మధ్య సరదా సంభాషణను చూపుతోంది. అలాగే సాయిపల్లవి సరదాగా కనిపిస్తోన్న పిక్స్.. ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. నాగ చైతన్య, సాయి పల్లవి ఇద్దరూ డీ-గ్లామరస్‌గా పాత్రలకు అనుగుణంగా కనిపిస్తున్నారు.

'జవాన్-2పై ఇప్పుడే చెప్పలేను'

షారూక్‌ఖాన్ హీరోగా దర్శకుడు అట్లీ తెరకెక్కించిన చిత్రం 'జవాన్'. ఈ సినిమా రూ.వెయ్యి కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టింది. షారూక్ కెరీర్‌లోనే హిట్ సినిమాల జాబితాలో నిలిచింది. జవాన్ సినిమా సీక్వెల్‌పై అట్లీ స్పందించారు. 'ప్రతి సినిమాకు సీక్వెల్ తీసే అవకాశం ఉంటుంది. జవాన్ సీక్వెల్ గురించి ఇప్పుడే చెప్పలేను. ఖచ్చితంగా ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇస్తాను. షారూక్‌తో పనిచేయటం ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన చాలా సరదాగా ఉంటారు. వర్క్ విషయంలో ఎక్కడా రాజీపడరు. త్వరలోనే ఆయనతో పనిచేస్తాను. ఎప్పుడు, ఎలా చేస్తామనే విషయం షారూక్ చేతిలోనే ఉంది.' అని పేర్కొన్నారు.

రష్మిక కసరత్తులు



టాలీవుడ్, బాలీవుడ్‌లోనూ రాణిస్తున్న హీరోయిన్ రష్మిక మందన్న. తాజాగా ఆమె ఫిట్‌నెస్ కోసం ఫీట్లు చేస్తున్నారు. ఆమె జిమ్‌లో చేస్తున్న కసరత్తుల వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కెరియర్ పరంగా చూస్తే ఆమె చాలా సినిమాల్లో ప్రస్తుతం బిజీగా ఉన్నారు. పుష్ప, యానిమల్ లాంటి హిట్ సినిమాల్లో నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అల్లు అర్జున్‌తో కలిసి పుష్ప-2 సినిమాలో నటిస్తున్నారు.

చెన్నై బోణి

బెంగళూరుపై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం

బౌలింగ్‌లో మెరిసిన ముస్తాఫిజుర్

చెన్నైను గెలిపించిన దూబే, జడేజా

చెన్నై: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17లో చెన్నై సూపర్‌కింగ్(సిఎస్‌కె) బోణీ కొట్టింది. చెపాక్ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 173పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని చెన్నై 18.4ఓవర్లలో 4వికెట్లు నష్టపోయి 176పరుగులు చేసి ఘన విజయం సాధించింది. చెన్నై జట్టులో రచిన్ రవీంద్ర(37), రహానే(27), మిఛెల్(22)తో పాటు ఇంపాక్ట్ ప్లేయర్ శివమ్ దూబే(34), జడేజా(25) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. గ్రీన్‌కు రెండు, యశ్ దయాల్, కరణ్ శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు బెంగళూరు టాపార్డర్ బ్యాటర్లు విఫలమైనా.. మిడిలార్డర్ ఆటగాళ్లు అనుజ్ రావత్(48; 25బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు), దినేశ్ కార్తీక్(38నాటౌట్: 26బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సర్లు)లు మెరుపులు మెరిపించారు. డుప్లెసిస్ చెలరేగడంతో బెంగళూరు తొలి 5ఓవర్లలో 41 పరుగులు రాబట్టింది. ఆ దశలో చెన్నై బౌలర్ ముస్తాఫిజుర్ తొలి బ్రేక్ ఇస్తూ ఒకే ఓవరలో రెండు వికెట్లు తీశాడు. భారీ షాట్ ఆడిన డూప్లెసిస్(35) బౌండరీ వద్ద రచిన్ రవీంద్రకు చిక్కాడు. ఆ తర్వాత వచ్చిన రజత్ పాటిదార్(0)ను ధోనీ వెనక్కి పంపాడు. ఆ తర్వాత బెంగళూరును కోహ్లి(21), కామెరూన్ గ్రీన్(18) ఆదుకున్నారు. 78 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన బెంగళూరును దినేశ్ కార్తీక్(38నాటౌట్), అనుజ్ రావత్(48)లు ఆదుకున్నారు. వీరు ఆరో వికెట్‌కు వీరు 95 పరుగులు జోడించారు. దీంతో బెంగళూరు భారీస్కోర్ నమోదు చేసింది. చెన్నై బౌలర్లలో ముస్తాఫిజుర్‌కు నాలుగు, దీపక్ చాహర్‌కు ఒక వికెట్ లభించగా.. రావత్ రనౌటయ్యాడు.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా..)

బెంగళూరు: 173/6 (20 ఓవర్లలో; రావత్ 48, దినేశ్ కార్తీక్ 38నాటౌట్; ముస్తాఫిజుర్ 4/29)

చెన్నై : 176/4 (18.4ఓవర్లలో; రచిన్ రవీంద్ర 37, దూబే 34నాటౌట్; జడేజా 25నాటౌట్, గ్రీన్ 2/27

ఐపిఎల్‌లో నేడు..

పంజాబ్ × ఢిల్లీ (వేదిక: మొహాలీ; మ.3.30గం॥లకు)

కోల్‌కతా × సన్‌రైజర్స్ (వేదిక: ఈడెన్ గార్డెన్స్; రా.7.30గం॥లకు)

ఐపిఎల్ వేడుకలు అదుర్స్...

- అలరించిన బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ విన్యాసం
- ఎఆర్ రెహమాన్, సోను నిగమ్, టైగర్ ష్రాఫ్ ప్రదర్శనలు కూడా..

ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)-2024 ఆరంభ వేడుకలు ఎంఎ చిదంబరం(చెపాక్) స్టేడియంలో శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. ప్రారంభోత్సవ వేడుకల్లో బాలీవుడ్ స్టార్స్ అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ చేసిన ప్రదర్శలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. తొలుత జాతీయ జెండాతో అక్షయ్ కుమార్ గ్రాండ్ ఎంట్రీతో ఈ వేడుకలు మొదలయ్యాయి. ప్రముఖ సంగీత దర్శకుడు ఎఆర్ రెహమాన్ పాడిన 'మా తుఝే సలామ్' పాటకు గ్యాలరీలో కూర్చున్న ప్రేక్షకులంతా స్వరం కలుపగా.. సింగర్ సోనూ నిగమ్ పాడిన దేశభక్తి పాటలు అభిమానులను ఉత్సాహరిచారు. అనంతరం వేదికపైకి చెన్నై నూతన సారథి రుతురాజ్ గైక్వాడ్ ఐపిఎల్ సీజన్-17 ట్రోఫీని తీసుకొచ్చాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) కెప్టెన్ డుప్లెసిస్, బిసిసిఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జే షా, లీగ్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్, ఉపాధ్యక్షులు రాజీవ్ శుక్లా తదితరులు హాజరయ్యారు.

భారత్ తొలి ప్రత్యర్థి ఇండోనేషియా

థామస్, ఉబర్ కప్ డ్రా విడుదల

చెంగ్డు(చైనా): చైనా వేదికగా జరిగే థామస్, ఉబర్ కప్ డ్రా విడుదలైంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత పురుషుల జట్టు గ్రూప్ దశలో తొలి మ్యాచ్‌లో ఇండోనేషియాతో తలపడనుంది. ఇక ఉబర్ కప్‌లో మహిళల జట్టు తొలిరౌండ్‌లో పటిష్ట చైనాతో గ్రూప్ లీగ్ మ్యాచ్ ఆడనుంది. థామస్, ఉబర్ కప్ నిర్వాహకులు శుక్రవారం డ్రా విడుదల చేశారు. గ్రూప్ దశలో ప్రతి జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కోసారి తలపడనున్నాయి. ప్రతి జట్టు మూడు సింగిల్స్, రెండు డబుల్స్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. టాప్-2లో నిలిచిన జట్లు క్వార్టర్స్‌కు చేరతాయి. ఈ టోర్నమెంట్ ఏప్రిల్ 27నుంచి మే 5వరకు జరగనుంది.

ఉబెర్ కప్...

గ్రూప్-ఎ: ఇండియా, చైనా, కెనడా, సింగపూర్

గ్రూప్-బి: థాయ్‌లాండ్, చైనీస్ తైపీ, మలేషియా, ఆస్ట్రేలియా

గ్రూప్-సి: జపాన్, ఇండోనేషియా, హాంకాంగ్, ఉగండా

గ్రూప్-డి: కొరియా, డెన్మార్క్, అమెరికా, మెక్సికో

థామస్ కప్...

గ్రూప్-ఎ: చైనా, కొరియా, కెనడా, ఆస్ట్రేలియా

గ్రూప్-బి: జపాన్, చైనీస్ తైపీ, జర్మనీ, ఛెచియా

గ్రూప్-సి: ఇండోనేషియా, ఇండియా, థాయ్‌లాండ్, ఇంగ్లండ్

గ్రూప్-డి: డెన్మార్క్, మలేషియా, హాంకాంగ్, అల్జీరియా



సెమీస్‌కు శ్రీకాంత్

బస్సెల్(స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ సత్తా చాటాడు. క్వార్టర్‌ఫైనల్లో 16వ సీడ్ చైనీస్ తైపీ షట్లర్‌పై విజయం సాధించాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోటీలో శ్రీకాంత్ 21-10, 21-14తో ఛియా-హో-లీ(చైనీస్ తైపీ)ను చిత్తుచేశాడు. ఈ మ్యాచ్ కేవలం 34 నిమిషాల్లోనే ముగిసింది. ఇక మహిళల డబుల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌కు చేరిన 8వ సీడ్ ట్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్ 14-21, 15-21తో ఆస్ట్రేలియాకు చెందిన సెత్యానా-అంగేలా చేతిలో ఓడారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68